ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -344 పేజీలు - 08 వెల - 04/- బుధవారం 12 నవంబర్ 2025

# ఆలోచనతో రండి.. పారిశ్రామికవేత్తలు కండి

## కనిగిరిలో ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించిన సీఎం చంద్రబాబు




- రాష్ట్రవ్యాప్తంగా 50 పార్కులకు వర్చువల్‌గా శ్రీకారం
- రూ.25,256 కోట్ల పెట్టుబడులతో 25 పరిశ్రమల ప్రారంభోత్సవం
- పారిశ్రామికవేత్తలకు అన్ని వసతులు కల్పిస్తామన్న సీఎం
- చెత్త నుంచి సంపద సృష్టించడం కొత్త విధానమని వెల్లడి
- గత పాలనలో పారిశ్రామికవేత్తలు పారిపోయారని విమర్శ

**కనిగిరి నవంబర్ 11 ఆంధ్ర ప్రగతి**

యువత మంచి ఆలోచనలతో ముందుకు వస్తే, వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే బాధ్యత తమదని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి 175 నియోజకవర్గాల్లో 'ప్లగ్ అండ్ ప్లే' విధానంలో పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేసి, లక్షలాది ఉద్యోగాలు సృష్టిస్తామని ఆయన ప్రకటించారు. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పెదఈర్లపాడులో ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ పార్కును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మరో 17 జిల్లాల్లో రూ.873 కోట్ల వ్యయంతో 868 ఎకరాల్లో అభివృద్ధి చేసిన 49 ఎంఎస్ఎంఈ పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. వీటితో పాటు రూ.25,256 కోట్ల పెట్టుబడులతో ఏర్పాటైన 38 మెగా పారిశ్రామిక యూనిట్లను కూడా సీఎం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం పలు జిల్లాల పారిశ్రామికవేత్తలతో మిగతా 2లో.

# సూత్రధారులను వదిలిపెట్టం

## ఢిల్లీ పేలుడు కేసును ఎన్ఐఏకి అప్పగించిన కేంద్ర హెూంశాఖ



- 13కి చేరిన మృతుల సంఖ్య, 25 మందికి గాయాలు
- పేలుళ్లకు పుల్వామాతో సంబంధాలున్నట్లు అనుమానాలు
- కేంద్ర హెూంమంత్రి అమిత్ షా ఉన్నతస్థాయి భద్రతా సమీక్ష
- సూత్రధారులను వదిలిపెట్టబోమని స్పష్టం చేసిన ప్రధాని
- రాజధాని వ్యాప్తంగా హై అలర్ట్, భద్రత కట్టుదిట్టం

**ఢిల్లీ, ననవంబర్ 11 ఆంధ్ర ప్రగతి**

దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన కారు బాంబు పేలుడు కేసు దర్యాప్తును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారికంగా స్వీకరించింది. ఈ దుర్ఘటనలో మృతుల సంఖ్య 13కి పెరిగింది. మరో 25 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పేలుడు ఘటన సూత్రధారులను వదిలిపెట్టబోమని,

# భారత్‌తో ఒప్పందానికి చాలా దగ్గరలో ఉన్నాం



: ట్రంప్ కీలక ప్రకటన

- గత ఒప్పందాల కంటే ఇది భిన్నమైందని, న్యాయబద్ధంగా ఉంటుందని వెల్లడి
- ప్రధాని మోదీతో తనకు అద్భుతమైన సంబంధాలున్నాయని వ్యాఖ్య

భారత్‌తో వాణిజ్య ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం ఖరారుకు చాలా దగ్గరలో ఉన్నామని ఆయన వెల్లడించారు. గతంలో జరిగిన ఒప్పందాలకు ఇది పూర్తిగా భిన్నంగా, ఇరు పక్షాలకు న్యాయం చేకూర్చేలా ఉంటుందని స్పష్టం చేశారు. అందరికీ ప్రయోజనం కలిగించేలా ఈ ఒప్పందం రూపుదిద్దుకుంటోందని ట్రంప్ తెలిపారు. మిగతా 2లో.

# సీఎం చంద్రబాబు మైనారిటీల పక్షపాతి.

- మైనార్టీల సంక్షేమానికి ఆద్యులు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు.
- భారతరత్న అబుల్ కలాం ఆజాద్ సేవలు అనిర్వచనీయం.

-రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎమ్. డీ ఫరూక్.



3లో.

# పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ లో ఆత్మాహుతి దాడి...

- ఇస్లామాబాద్ జ్యుడీషియల్ కాంప్లెక్స్ వద్ద భారీ పేలుడు
- ఈ ఘటనలో 12 మంది మృతి, 20 మందికి పైగా గాయాలు
- మృతుల్లో అత్యధికులు న్యాయవాదులేనని గుర్తింపు
- ఈ దాడితో తమకు సంబంధం లేదని ప్రకటించిన టీటీపీ



ఇస్లామాబాద్ **నవంబర్ 11 రిపబ్లిక్ న్యూస్:-**
పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ భారీ పేలుడుతో దద్దరిల్లింది. మంగళవారం నాడు నగరంలోని జ్యుడీషియల్ కాంప్లెక్స్ సమీపంలో జరిగిన శక్తిమంతమైన పేలుడులో కనీసం 12 మంది ప్రాణాలు కోల్పోగా, మిగతా 2లో.

# హిందువుల విశ్వాసాలతో ఆడుకోవద్దు



- సనాతన ధర్మ పరిరక్షణ బోర్డును ఏర్పాటు చేయాలంటూ పవన్ కల్యాణ్ ట్వీట్
- తిరుపతి లడ్డూ కేవలం ప్రసాదం కాదు, ఉమ్మడి భావోద్వేగం అని వెల్లడి

**అమరావతి,నవంబర్ 11 ఆంధ్ర ప్రగతి**

సనాతన ధర్మాన్ని, హిందువుల మనోభావాలను పరిరక్షించేందుకు 'సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు'ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రపంచవ్యాప్త హిందూ మిగతా 2లో.

# జూబ్లీహిల్స్‌లో 47.16 శాతం పోలింగ్

- సాయంత్రం వరకు 47.16 శాతం పోలింగ్ నమోదు
- షేక్‌పేట డివిజన్‌లో పోలీసుల లాఠీఛార్జి
- పలువురు ఎమ్మెల్యేలపై కేసు నమోదు



హైదరాబాద్,**నవంబర్ 11 ఆంధ్ర ప్రగతి** -జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో పోలింగ్ శాతం తక్కువగా నమోదయ్యింది. గత పక్షం రోజులుగా హోరాహోరీ ప్రచారం చేసి, ఓట్లను అర్థించిన ఓటర్లు పెద్దగా స్పందించ లేదు. ఉదయం నుంచి మందకొడిగా సాగిన పోలింగ్ పక్రియ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. మిగతా 2లో.

# అశ్రునయనాల మధ్య అందెశ్రీ అంత్యక్రియలు

## పాడెమోసి ప్రేమ చాటుకున్న సీఎం రేవంత్



- హాజరైన పలువురు నేతలు..మంత్రులు..కళకారులు
- పోలీసుల గౌరవ వందనం మధ్యఅంత్యక్రియలు పూర్తి
- అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తాం
- ఆయన పేరు శాశ్వతంగా నిలిచేలా ప్రయత్నిస్తా
- పద్మశ్రీ కోసం గతంలోనే కేంద్రానికి లేఖ రాసా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్,**నవంబర్ 11 ఆంధ్ర ప్రగతి**

అశ్రు నయనాల మధ్య ప్రకృతి కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు ముగిశాయి. ప్రభుత్వ అధికారిక లాంఛనాల నడుమ ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు మూడుసార్లు గాలిలోకి కాల్పులు జరిపిన తర్వాత అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మిగతా 2లో...

# కల్తీ నెయ్యి కేసు... వైవీ సుబ్బారెడ్డికి సిట్ నోటీసులు

- తిరుమల లడ్డూ ప్రసాదం నెయ్యి కల్తీ కేసులో దర్యాప్తు వేగవంతం
- టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి సిట్ నోటీసులు జారీ
- ఈ నెల 13వ తేదీన విచారణకు హాజరు కావాలని ఆదేశం
- సుబ్బారెడ్డి హయాంలోనే కల్తీ నెయ్యి సరఫరా జరిగిందన్న ఆరోపణలు



2లో.

# మెడికల్ కాలేజీలపై నేడు వైసీపీ ర్యాలీలు

- విజయవంతం చేయాలంటూ నేతలను కోరిన సజ్జల
- తిరుపతి లడ్డూపై ఆధారాల్లేకుండా ఆరోపణలంటూ ధ్వజం



**అమరావతి, నవంబర్ 11 ఆంధ్ర ప్రగతి** మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తున్నారంటూ రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ బుధవారం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ర్యాలీలను చేపట్టనుందిమిగతా 2లో...

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ లో ఆత్మాహుతి దాడి...

**(మొదటి పేజీ తరువాయి)**20 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో అత్యధికులు న్యాయవాదులేనని పాక్ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఇది ఆత్మాహుతి దాడి అని భావిస్తున్నారు.స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో కోర్టు గేటు వద్ద పార్క్ చేసి ఉన్న ఓ కారులో ఈ పేలుడు సంభవించింది. ఇది అత్యంత రద్దీగా ఉండే సమయం కావడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగింది. ప్రాథమిక దర్యాప్తు ప్రకారం, కారులోని గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని భావిస్తున్నా, ఇది ఆత్మాహుతి దాడి అయి ఉండొచ్చని కూడా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ పేలుడు తీవ్రతకు చుట్టుపక్కల పార్క్ చేసిన అనేక వాహనాలు ధ్వంసమయ్యాయి. సుమారు 6 కిలోమీటర్ల దూరం వరకు పేలుడు శబ్దం వినిపించినట్లు స్థానికులు తెలిపారు."నేను నా కారు పార్క్ చేసి కాంప్లెక్స్‌లోకి వెళుతుండగా, గేటు దగ్గర పెద్ద శబ్దం వినిపించింది. అక్కడ రెండు మృతదేహాలు పడి ఉన్నాయి. అనేక కార్లు మంటల్లో కాలిపోతున్నాయి" అని రుస్తుమ్ మాలిక్ అనే న్యాయవాది ఏఎఫ్‌పీ వార్తా సంస్థకు వివరించారు. ఈ ఆత్మాహుతి దాడిని పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ తీవ్రంగా ఖండించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ పేలుడుకు కొన్ని గంటల ముందే దక్షిణ వజీరిస్థాన్‌లో పాక్ భద్రతా దళాలు ఓ ఉగ్రకుట్రను భగ్నం చేశాయి. వానాలోని కేడెట్ కాలేజీపై తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ఉగ్రవాదులు చేయబోయిన దాడిని భద్రతా దళాలు అడ్డుకుని, ఇద్దరు ఉగ్రవాదులను హతమార్చాయి. 2014లో పెషావర్‌లోని ఆర్మీ స్కూల్‌పై జరిగిన తరహా దాడినే పునరావృతం చేయాలని ఉగ్రవాదులు ప్రయత్నించారని పాక్ సైన్యం వెల్లడించింది. ఆనాటి దాడిలో 154 మంది ప్రాణాలు కోల్పోయారు. గత కొంతకాలంగా పాకిస్థాన్ టీటీపీ ఉగ్రవాదుల నుంచి తీవ్ర ముప్పును ఎదుర్కొంటోంది. ఆఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు అధికారంలోకి వచ్చిన తర్వాత పాక్‌లో టీటీపీ కార్యకలాపాలు పెరిగాయి. టీటీపీ నాయకులకు ఆఫ్ఘనిస్థాన్ ఆశ్రయం కల్పిస్తోందని ఇస్లామాబాద్ ఆరోపిస్తుండటంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

## హిందువుల విశ్వాసాలతో ఆడుకోవద్దు

**(మొదటి పేజీ తరువాయి)**

సమాజానికి కేవలం పుణ్యక్షేత్రం మాత్రమే కాదని, అదొక పవిత్రమైన ఆధ్యాత్మిక గమ్యస్థానం అని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ స్పందిస్తూ, "తిరుపతి లడ్డూ కేవలం ఒక స్వీట్ కాదు, అది మనందరి ఉమ్మడి భావోద్వేగం. స్నేహితులు, కుటుంబ సభ్యులు, చివరికి అపరిచితులతో కూడా మనం ఆ ప్రసాదాన్ని పంచుకుంటాం. ఎందుకంటే, అది మన సామూహిక విశ్వాసానికి, ప్రగాఢ భక్తికి ప్రతీక" అని వివరించారు. ఏటా సగటున 2.5 కోట్ల మంది భక్తులు తిరుమలను సందర్శిస్తారని గుర్తుచేశారు."సనాతనుల మనోభావాలను, ఆచారాలను ఎగతాళి చేసినప్పుడు లేదా కించపరిచినప్పుడు అది కేవలం బాధ కలిగించడమే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తుల నమ్మకాన్ని, విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. లౌకికవాదం అనేది రెండు వైపులా ఉండాలి. మా విశ్వాసానికి రక్షణ, గౌరవం ఇవ్వడంలో రాజీ పడకూడదు" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

మన సనాతన ధర్మం అత్యంత పురాతనమైన, నిరంతరం అభివృద్ధి చెందుతున్న నాగరికత అని పేర్కొన్న పవన్, భాగస్వాములందరి ఏకాభిప్రాయంతో 'సనాతన ధర్మ పరిరక్షణ బోర్డు'ను స్థాపించడానికి ఇదే సరైన సమయమని ఆయన అభిప్రాయపడ్డారు.అంతకుముందు, నటుడు ప్రకాశ్ రాజ్ సోషల్ మీడియాలో తిరుపతి లడ్డూ అంశంపై తనదైన శైలిలో స్పందించారు. "పాలు లేని కల్తీ నెయ్యిలో మతోన్మాదాన్ని కలపకుండా, కల్తీ రాజకీయం చేయకుండా ఇప్పటికైనా తప్పు చేసిన వాడిని శిక్షించే పని చూడండి" అంటూ ట్వీట్ చేశారు.

## భారత్‌తో ఒప్పందానికి చాలా దగ్గరలో ఉన్నాం

**(మొదటి పేజీ తరువాయి)**

భారత్‌కు అమెరికా నూతన రాయబారిగా నియమితులైన సెర్గియో గోర్ ప్రమాణ స్వీకార కార్యక్రమం వైట్‌హౌస్‌లోని ఓవల్ ఆఫీస్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ట్రంప్, ఈ వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్.. గోర్‌తో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ట్రంప్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీతో తనకు అద్భుతమైన సంబంధాలున్నాయని అన్నారు. అమెరికాకు ఉన్న అత్యంత ముఖ్యమైన అంతర్జాతీయ భాగస్వామ్యాల్లో భారత్‌తో ఉన్న వ్యూహాత్మక బంధం ఒకటని ఆయన అభివర్ణించారు. "ప్రపంచంలోని పురాతన నాగరికతల్లో ఒకటైన భారత్ అద్భుతమైన దేశం. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో మాకు ముఖ్యమైన ఆర్థిక, వ్యూహాత్మక భద్రతా భాగస్వామి. సెర్గియో నియామకంతో ఈ సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని నేను విశ్వసిస్తున్నాను" అని ట్రంప్ పేర్కొన్నారు.అక్టోబర్‌లో సెనేట్ ఆమోదం పొందిన 38 ఏళ్ల సెర్గియో గోర్, భారత్‌కు అత్యంత పిన్న వయస్కుడైన అమెరికా రాయబారిగా రికార్డు సృష్టించారు. ట్రంప్‌కు అత్యంత సన్నిహితుల్లో ఒకరైన ఈయన, గతంలో వైట్‌హౌస్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఈ సందర్భంగా గోర్ మాట్లాడుతూ.. తనకు ఈ అవకాశం కల్పించినందుకు అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను మెరుగుపరచడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా మాట్లాడుతూ.. "అధ్యక్షుడు, నేను ఇద్దరం భారత్‌ను ప్రేమిస్తాం" అని వ్యాఖ్యానించారు.

## కల్తీ నెయ్యి కేసు... వైవీ సుబ్బారెడ్డికి సిట్ నోటీసులు

**తిరుమలనవంబర్ 11 ఆంధ్ర ప్రగతి**

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారన్న ఆరోపణలకు సంబంధించిన కేసులో దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసు విచారణలో భాగంగా టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ సీనియర్ నేత వైవీ సుబ్బారెడ్డికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) నోటీసులు జారీ చేసింది. ఈ నెల 13వ తేదీన తమ ముందు విచారణకు హాజరు కావాలని ఆ నోటీసులలో స్పష్టంగా పేర్కొంది.

వైవీ సుబ్బారెడ్డి టీటీడీ చైర్మన్‌గా పదవిలో ఉన్న సమయంలోనే శ్రీవారి ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా జరిగిందనేది ప్రధాన ఆరోపణ. ఈ వ్యవహారం రాష్ట్రంలో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్, దర్యాప్తును వేగవంతం చేసింది. కేసులో కీలక ఆధారాలు సేకరించే పనిలో భాగంగా ఇప్పుడు కీలక వ్యక్తులను విచారించడంపై దృష్టి సారించింది.

ఇప్పటికే ఈ కేసులో భాగంగా దర్యాప్తు అధికారులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. కొంతమంది అధికారులు, నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్లను కూడా విచారించింది. ఇప్పుడు మాజీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిన వైవీ సుబ్బారెడ్డిని విచారించడం ద్వారా మరిన్ని కీలక వివరాలు రాబట్టాలని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఆయన ఇచ్చే వాంగ్మూలం ఈ కేసులో అత్యంత కీలకంగా మారనుంది.

# ఓటెత్తిన బీహార్

### రెండోవిడతలో 67.14 శాతం పోలింగ్

### రాష్ట్ర చరిత్రలోనే రికార్డు స్థాయిలో ఓటింగ్

**పాట్నా:, నవంబర్ 11 ఆంధ్ర ప్రగతి**



బీహార్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశ పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. 20 జిల్లాల పరిధిలోని 122 స్థానాలకు మంగళవారం ఎన్నికలు జరగగా.. ఈ విడతలో 3.7 కోట్ల మంది ఓటర్లకు గాను.. పోలింగ్ ముగిసే సమయానికి రికార్డు స్థాయిలో 67.14శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు.తొలి విడతలోనూ 65.9 శాతం భారీ పోలింగ్ నమోదైన విషయం తెలిసిందే. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల చరిత్రలోనే ఈసారి అత్యధిక శాతం పోలింగ్ నమోదైనట్టు సమాచారం. 2000లో బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 62.57 శాతం ఓటింగ్ నమోదు కాగా.. ఇప్పటివరకు ఇదే గరిష్టం కావటం విశేషం. లోక్‌సభ ఎన్నికల విషయానికొస్తే.. 1998లో అత్యధికంగా 64.6శాతం పోలింగ్ నమోదైంది. ఇక సర్వేల ఫలితాలు వస్తున్నా.. కొన్ని సందర్భాల్లో ఆ ఫలితాలు తారుమారైన విషయం తెలిసిందే. కాగా ఎన్నికల ఫలితాలు నవంబర్ 14న వెలుదికానున్నాయి.

# సూత్రధారులను వదిలిపెట్టం

**(మొదటి పేజీ తరువాయి)**

దర్యాప్తు సంస్థలు ఈ కేసు మూలాల్లోకి వెళ్లి నిందితులను పట్టుకుంటాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం స్పష్టం చేశారు.

సోమవారం సాయంత్రం ఎర్రకోట మెట్రో స్టేషన్ వద్ద ఉన్న ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర హ్యుందాయ్ ఐ20 కారులో శక్తిమంతమైన పేలుడు సంభవించిన విషయం తెలిసిందే. అమోనియం నైట్రేట్, ఫ్యూయల్ ఆయిల్, డిటోనేటర్లను ఉపయోగించినట్లు ఫోరెన్సిక్ ప్రాథమిక నివేదికలో వెల్లడైంది. ఈ కేసును కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఎన్ఐఏకి అప్పగించదింది. ఈ కేసును చేతిలోకి తీసుకున్న వెంటనే ఎన్ఐఏ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని విస్తృతంగా తనిఖీలు ప్రారంభించింది. చుట్టుపక్కల ప్రాంతాలను జల్లెడ పడుతూ, సాక్ష్యాధారాలను సేకరించే పనిలో నిమగ్నమైంది.

**అమిత్ షా ఉన్నతస్థాయి సమీక్ష**

ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా మంగళవారం తన నివాసంలో ఉన్నతస్థాయి భద్రతా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఐబీ డైరెక్టర్ తపన్ డేకా, ఢిల్లీ పోలీస్ కమిషనర్ సతీశ్ గోల్చా, ఎన్ఐఏ డీజీ సదానంద్ వసంత్ దాతే పాల్గొన్నారు. జమ్మూకశ్మీర్ డీజీపీ నళిన్ ప్రభాత్ వర్చువల్‌గా హాజరయ్యారు. అన్ని కోణాల్లోనూ లోతైన దర్యాప్తు జరుగుతుందని అమిత్ షా తెలిపారు.

**పుల్వామాతో సంబంధాలు**

పేలుడుకు ఉపయోగించిన కారుకు జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాతో సంబంధాలున్నట్లు ఢిల్లీ పోలీసులు అనుమానిస్తున్నారు. పుల్వామాకు చెందిన ఓ వ్యక్తి ఈ కారును కొనుగోలు చేసి ఉండవచ్చని భావిస్తున్నారు. అనుమానితుడు ఒక్కడే కారులో ఎర్రకోట పార్కింగ్ ప్రాంతంలోకి వచ్చి వెళ్లినట్లు సీసీటీవీ ఫుటేజీలో నమోదైంది. టోల్ ప్లాజాలతో సహా 100కు పైగా సీసీటీవీ క్లిప్పింగులను పరిశీలిస్తూ దర్యాగంజ్ వైపు కారు ప్రయాణించిన మార్గాన్ని పోలీసులు ట్రేస్ చేస్తున్నారు. కారులో ఉన్న వ్యక్తి పుల్వామాకు చెందిన డాక్టర్ ఉమర్ అయి ఉండవచ్చని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.

ఈ ఘటనపై ఢిల్లీ పోలీసులు చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం పేలుడు పదార్థాల చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పహార్‌గంజ్, దర్యాగంజ్ ప్రాంతాల్లోని హోటళ్లలో రాత్రంతా దాడులు నిర్వహించి నలుగురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. రాజధాని వ్యాప్తంగా హై అలర్ట్ ప్రకటించి విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినళ్లలో భద్రతను కట్టుదిట్టం చేశారు.

# ఆలోచనతో రండి.. పారిశ్రామికవేత్తలు కండి

**(మొదటి పేజీ తరువాయి)**

వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయని చంద్రబాబు అన్నారు. "ఈ రోజు 99 కంపెనీలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసుకుంటున్నాం. వీటి ద్వారా రూ.2.65 లక్షల కోట్ల పెట్టుబడులతో 2 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. జనవరి నాటికి మరో 70 ఎంఎస్ఎంఈ పార్కులను ప్రారంభిస్తాం. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే మా లక్ష్యం" అని సీఎం వివరించారు. టెక్నాలజీ భవిష్యత్తును శాసిస్తుందని, అందుకే అమరావతిలో జనవరికి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. సౌర విద్యుత్, గ్రీన్ హైడ్రోజన్, బయో ఫ్యూయెల్ ప్లాంట్ల ఏర్పాటుతో ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధిస్తామన్నారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ, త్వరలోనే సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటు కానున్నట్లు వెల్లడించారు. ఈ నెల 14, 15 తేదీల్లో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సులో రూ.10 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకోనున్నామని, తద్వారా 8 లక్షల ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు.

**గత పాలనపై తీవ్ర విమర్శలు**

గత ప్రభుత్వ హయాంలో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం విడిచి పారిపోయారని, పరిశ్రమలు మూతపడ్డాయని చంద్రబాబు విమర్శించారు. "గతంలో పారిశ్రామికవేత్తలు 'ఛలోఛలో' అంటూ రాష్ట్రం నుంచి వెళ్లిపోతే, ఇప్పుడు 'భలేభలే' అంటూ తిరిగి వస్తున్నారు. విశాఖకు గూగుల్ సంస్థ లక్ష కోట్ల పెట్టుబడితో వస్తోంది. ఇదే మా ప్రభుత్వంపై ఉన్న నమ్మకం" అని అన్నారు.

గత పాలకులు పీపీఏలు రద్దు చేసి, విద్యుత్ వాడకుండానే రూ.9 వేల కోట్లు చెల్లించారని, ఆ డబ్బు ఉండి ఉంటే ఎన్నో ప్రాజెక్టులు పూర్తయ్యేవని ఆవేదన వ్యక్తం చేశారు. ధ్వంసమైన ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం ఏ పాలసీ తెచ్చినా దేశంలో మొదట అమలు చేసేది ఏపీనే అని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పూర్తి సహకారం అందిస్తుండగా, మంత్రి లోకేశ్ పట్టువదలని విక్రమార్కుడిలా పనిచేస్తున్నారని ప్రశంసించారు.

**సంపద సృష్టి.. ప్రజల భాగస్వామ్యం**

రాష్ట్రంలో సంపద సృష్టించి, అందులో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తామని చంద్రబాబు పునరుద్ఘాటించారు. "ఆలోచనలే ఇప్పుడు ఆస్తి. లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రైతులు కూడా ఎఫ్‌పీఓలు ఏర్పాటు చేసుకుని పారిశ్రామికవేత్తలుగా మారాలి," అని పిలుపునిచ్చారు. ఎంఎస్ఎంఈల ద్వారానే 5 లక్షల ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించామన్నారు. రామాయపట్నం పోర్టు సమీపంలో బీపీసీఎల్ సంస్థ లక్ష కోట్ల పెట్టుబడితో రిఫైనరీ ఏర్పాటు చేస్తోందని, పోర్టులను అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని ఈస్ట్ కోస్ట్ లాజిస్టిక్స్ హబ్‌గా మారుస్తామని తెలిపారు. 15 శాతం వృద్ధి రేటు సాధించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

**వెనుకబడిన ప్రాంతాలకు పెద్దపీట**

వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిశ్రమలు, సాగునీరు అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. "2026 నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రకాశం జిల్లాకు నీళ్లిస్తాం. కనిగిరి ఇకపై కనకపట్నం అవుతుంది. కరవు పీడిత ప్రాంతాలైన కనిగిరి, యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాలకు గోదావరి జలాలను కూడా తీసుకొస్తాం. 2019లో మేం అధికారంలోకి రాకపోవడం వల్లే ఈ ప్రాజెక్టు ఆలస్యమైంది," అని అన్నారు. భవిష్యత్తులో ప్రజలకు ఇలాంటి కష్టాలు రాకుండా చూస్తామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి,

# అశ్రునయనాల మధ్య అందెశ్రీ అంత్యక్రియలు

**(మొదటి పేజీ తరువాయి)**

మంగళవారం ఉదయం అందెశ్రీ అంతిమయాత్ర ప్రారంభమైంది. అంతకుముందు లాలాపేటలోని అందెశ్రీ నివాసం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ వరకు అంతిమయాత్ర నిర్వహించారు. అంతమయాత్రలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీలు వీ.హనుమంతరావు, సర్వే సత్యనారాయణ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క పాల్గొన్నారు. అందెశ్రీ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అందెశ్రీ పార్థీవ దేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. మంగళవారం ఉదయం ఘట్కేసర్ చేరుకున్న సీఎం.. అందెశ్రీ అంత్యక్రియలకు హాజరయ్యారు. అందెశ్రీ కుటుంబ సభ్యులను సీఎం రేవంత్ రెడ్డి ఓదార్చారు. లాలాపేట్ జయశంకర్ స్టేడియం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్కేసర్ వరకు అంతిమయాత్ర సాగింది. అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించింది. అందె శ్రీ అంత్యక్రియల్లో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, వి. హనుమంతరావు పాల్గొన్నారు. రచయిత అందెశ్రీ మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు.

ఆయన అంత్యక్రియల సందర్భంగా సీఎం అందెశ్రీ పాడెమోసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ నేతలను నేరుగా కలవనని చెప్పిన అందెశ్రీ, ఆ తరువాత మీడియా మధ్యమం ద్వారా కలిశాం.. ఆయన మరణం నాకు వ్యక్తిగతంగా ఆప్తుడిని కోల్పోయిన బాధను కలిగించింది అన్నారు. అందెశ్రీకి సముచిత న్యాయం కల్పిస్తాం.. ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. జీవితాంతం తెలంగాణ కోసం జీవించిన వ్యక్తి.. కళాకారుడిగా, రచయితగా ఆర్థికంగా ఎంత ఇబ్బంది పడ్డారో అందరికి తెలుసు అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉన్నంత వరకు అందెశ్రీ కీర్తీ శాశ్వతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయన రచించిన రచనలు 20 వేల నిప్పుల వాగు పుస్తకాలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అందుబాటులో పెడతాం అన్నారు. అందెశ్రీ అభిమానుల నుంచి సూచనలు తీసుకుంటాం.. ఏనాడు ఆర్థిక ఇబ్బంది గురించి ఆరోగ్యం గురించి ఆలోచించని వ్యక్తి అందెశ్రీ.. అతడ్ని కోల్పోవడం బాధాకరంగా ఉంది.. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాశా, ఈ విషయంపై ప్రధాని మోడీని కలిసి విజ్ఞప్తి చేస్తాను.. అందుకు కేంద్రమంత్రులు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. అలాగే ఆయన రచించిన జయజయహే తెలంగాణ పాటను పాఠ్యాంశంగా తీసుకొస్తామని తెలిపారు. అందెశ్రీ రచనలను పుస్తక రూపంలో తీసుకొస్తామని చెప్పారు. అందెశ్రీ నిప్పుల వాగు పుస్తకం ఒక గైడ్ అన్నారు. అందెశ్రీ రచనలు అన్ని లైబ్రరీల్లో ఉండేలా చర్యలు తీసుకుంటామని.. ఆయన పేరు, స్ఫూర్తి శాశత్వంగా ఉండేలా చూస్తామన్నారు. అందెశ్రీ పాట, మాట గొప్ప స్ఫూర్తిని ఇచ్చిందని.. ఎన్నో సందర్భాల్లో ఇద్దరం కలిసి అనేక కీలక అంశాలపై చర్చించామని గుర్తు చేసుకున్నారు. అందెశ్రీని కలిసినప్పుడల్లా సొంత అన్నను కలిసినట్టుగా ఉండేదన్నారు. గద్దర్ తో పాటు అందెశ్రీ పాటు తెలంగాణ ఉద్యమానికి ఎంతో బలాన్ని ఇచ్చాయని అన్నారు. అందెశ్రీ జయజయహే పాట తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి నింపిందని.. అందుకే జయజయహే పాటను రాష్ట్ర గీతంగా గుర్తించామని తెలిపారు. ఆయన పేరుతో ఒక స్మృతి వనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. అందెశ్రీ వ్యక్తిగతంగా తన మనసుకి దగ్గరి వ్యక్తి అని.. ఆయన లేని లోటు నా కుటుంబానికి వ్యక్తిగతంగా తీరని లోటన్నారు. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని గత ఏడాది కేంద్రానికి లేఖ రాశామని కానీ అవార్డు రాలేదన్నారు. ఈ సంవత్సరం కూడా కేంద్రానికి లేఖ రాస్తామని.. ఆయనకు పద్మశ్రీ గౌరవం దక్కేలా కేంద్రమంత్రులు బండి సంజయ్, కిషన్ రెడ్డి సహకరించాలని కోరారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలుగా అందెశ్రీని పద్మశ్రీతో గౌరవించుకునేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

## మెడికల్ కాలేజీలపై నేడు వైసీపీ ర్యాలీలు

**(మొదటి పేజీ తరువాయి)**

ఈ నెల ఏడో తేదీన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీలు నిర్వహిస్తామని జగన్ ప్రకటించారు. ఆ తర్వాత, ఈ నిరసనను ఈ నెల 12వ తేదీకి వాయిదా వేశారు. శాసనసభా నియోజకవర్గాల వారీగా చేపట్టే ఈ ర్యాలీలను విజయవంతం చేయాలని లోక్‌సభ నియోజకవర్గాల సమన్వయకర్తలను వైసీపీ రాష్ట్ర సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి కోరారు. మంగళవారం ఆయన పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్సు నిర్వహించారు. తిరుమల లడ్డూపై ఆధారాల్లేని ఆరోపణలు చేస్తున్నారంటూ సజ్జల రామకృష్ణారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. లడ్డూలో రసాయనాలు కలిశాయంటూ చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ప్రచారం చేస్తున్నారని అన్నారు. గతంలో ఆవునెయ్యి కల్తీ అయ్యిందని విమర్శించారని.. ఇప్పుడు రసాయనాలు కలిశాయంటూ ఆధారాల్లేకుండా మాట్లాడుతున్నారని సజ్జల ధ్వజమెత్తారు.

## జూబ్లీహిల్స్‌లో 47.16 శాతం పోలింగ్

**(మొదటి పేజీ తరువాయి)**

పోలింగ్ సమయం ముగిసే నాటికి క్యూలైన్లలో నిల్చున్న వారందరికీ ఓటేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. యూసుఫ్‌గూడ మహబూబ్ ఫంక్షన్ హాల్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దొంగ ఓట్ల విషయంలో నిలదీసిన బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నేతలు దాడులకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి.. ఇరు పార్టీల నేతలకు సర్దిచెప్పారు. కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే సాయంత్రం 5 గంటల సమయం వరకు 47.16 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా పోలింగ్ దాదాపు 50 శాతం వరకు చేరుకునే అవకాశం ఉంది. ఈ నెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ నియోజకవర్గంలోని కొన్ని డివిజన్లలో మాత్రం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా షేక్‌పేట డివిజన్ లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణ వాతావరణం నెలకొనడంతో, పోలీసులు రంగంలోకి దిగి లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. అక్కడ పోలింగ్ బూత్‌లు 4, 5, 6, 7, 8 వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున గుమిగూడారు. వాళ్లు హడావిడి చేయడంతో పోలీసులు వెళ్ళిపోవాలని వార్నింగ్ ఇచ్చారు.. కానీ, గులాబీ కార్యకర్తలు వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. పలువురు కార్యకర్తలను బూత్ ఏరియాస్ నుంచి చెదరగొట్టడానికి లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. ఈ ఉద్రిక్తత వెనుక నాన్-లోకల్స్ ఇష్యూ ఉంది.. ఎన్నికల నిబంధనల ప్రకారం? నాన్-లోకల్స్ నియోజకవర్గంలో తిరగకూడదు. అయినప్పటికీ, బీఆర్ఎస్ మాజీ మంత్రులు, నాయకులు బూత్‌ల వద్దకు వచ్చి హడావిడి చేస్తూ? ఓటర్లను ఇన్‌ఫ్లూయెన్స్ చేసే ప్రయత్నం చేస్తున్నారు అని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై ఇరు వర్గాల మధ్య పెద్ద గొడవ జరగడంతో పోలీసులు ఇరు వర్గాలను చెల్లాచెదురు చేయాల్సి వచ్చింది. ఒకవైపు ఓటింగ్ పర్సంటేజ్ మందకొడిగా సాగుతుంటే? మరోవైపు బస్తీలలో ఓటర్లను డబ్బులతో ఇన్‌ఫ్లూయెన్స్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, డబ్బులు అందకపోవడం వల్ల కూడా ఓటర్లు ఓటింగ్‌కు రావట్లేదని ఓపెన్‌గా మాట్లాడుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో బీఆర్ఎస్ తరపున మాగంటి సునీత, కాంగ్రెస్ తరపున నవీన్ యాదవ్, బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 12 నవంబర్ 2025

# సీఎం చంద్రబాబు మైనారిటీల పక్షపాతి.

**మైనార్టీల సంక్షేమానికి ఆద్యులు దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు.**

**భారతరత్న అబుల్ కలాం ఆజాద్ సేవలు అనిర్వచనీయం.**

**విద్యారంగానికి ఆయన చేసిన సేవలు భావితరాలకు స్ఫూర్తి.**

**మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట.**

**-రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్.ఎమ్. డీ ఫరూక్.**









**ఆంధ్ర ప్రగతి విజయవాడ నవంబర్11:**
లిరాష్ట్రంలోని మైనారిటీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు తన దూర దృష్టితో ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని, మైనారిటీల పక్షపాతి చంద్రబాబు అని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జాతీయ మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని మంగళవారం మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ భారత రత్న అబుల్ కలాం ఆజాద్ విద్యా రంగం మరియు మైనార్టీ సంక్షేమానికి చేసిన విశేష కృషికి గుర్తింపుగా ప్రతి సంవత్సరం ఆయన జన్మదినాన్ని జాతీయ విద్యా దినోత్సవం మరియు మైనార్టీ సంక్షేమ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. భారత ప్రముఖ శాస్త్రవేత్తగా ఉన్న మైనారిటీ వ్యక్తి అబ్దుల్ కలాంను అప్పట్లో ప్రధాని వాజ్ పేయిని ఒప్పించి దేశ అత్యున్నత స్థానం రాష్ట్రపతి స్థానంలో కూర్చోబెట్టడంలో చంద్రబాబు కీలక పాత్ర పోషించిన విషయాన్ని మంత్రి ఫరూక్ గుర్తు చేశారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ను స్థాపించిన ఘనత టిడిపి ప్రభుత్వానిదే నని అన్నారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు మైనార్టీల సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిన ఆద్యుడని అన్నారు. మైనారిటీ ల అభివృద్ధి సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన విజన్ తో ఏన్నో పథకాలకు శ్రీకారం చుట్టి అమలు చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఉర్దూను సెకండ్ లాంగ్వేజ్ గా గుర్తించి, ఉర్దూ పాఠశాలలను, ఉర్దూ రెసిడెన్షియల్ పాఠశాలలను, కంప్యూటర్ విద్యను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు . ఉమ్మడి రాష్ట్రంలో 200 ఎకరాల్లో హైద్రాబాద్ లో మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీని స్థాపించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కే దక్కిందని అన్నారు. కర్నూలు లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్శిటీ, కడపలో హజ్ హౌస్ ను ఏర్పాటుకు పునాది టిడిపి ప్రభుత్వంలోనే పడిందన్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో మైనారిటీల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. గుంటూరులో 16 కోట్ల తో చర్చి నిర్మాణం చేపడితే తాను క్రిస్టియన్ అని చెప్పుకునే జగన్ చర్చి నిర్మాణాన్ని నిలిపివేయడం, కడపలో హజ్ హౌస్ ను పూర్తి చేయకపోవడం వారి నిర్లక్ష్య పాలనకు నిదర్శనం అని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నేతృత్వంలో మైనారిటీలకు విద్య, ఉపాధి రంగాలలో అత్యున్నత అవకాశాలను, సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి అందిస్తున్నామని అన్నారు. ఉపాధ్యాయ పోస్టులకు భర్తీ డీఎస్సీ, టెట్, పోలీస్ ఉద్యోగాల భర్తీ కి, గ్రూపు ఉద్యోగాలకు పోటీపడే విద్యార్థులకు మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ అందిస్తున్నామని అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రోజుల్లోనే అల్ప సంఖ్యాకులైన మైనార్టీల అభివృద్ధికి నిరుద్యోగుల ఉపాధికి దుఖాన్, మకాన్ పథకం క్రింద సబ్సిడీ పై రుణాలను అందించి ఉపాధి కల్పించామన్నారు. 2019- 2024 మధ్యకాలంలో కేంద్రం నుంచి మైనార్టీల సంక్షేమం కోసం విడుదలైన నిధులను గత ప్రభుత్వం రాష్ట్ర వాటా చెల్లించకుండానే కేంద్రం నిధులను కూడా దారి మళ్లించిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకు సీఎం చంద్రబాబు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. అందులో భాగంగానే గత ప్రభుత్వం నిలిపివేసిన మైనార్టీ సంక్షేమ పథకాలను పునరుద్ధరించేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టడం జరిగిందని ఫరూక్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని మౌజమ్స్, పాస్టర్లకు ఇచ్చే పారితోషికం నిధులను కూటమి ప్రభుత్వం విడుదల చేసి మైనారిటీల పక్షపాత ప్రభుత్వంగా ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నదని మంత్రి ఫరూక్ అన్నారు. రాబోయే రోజుల్లో కూడా రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల అభివృద్ధికి, విద్యా పరంగా సైన్స్ అండ్ టెక్నాలజీ పరంగా ఉపాధి కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నారన్నారని వెల్లడించారు. ఎల్లప్పుడూ మైనార్టీ వర్గాలకు మంచి చేయాలని ఆలోచించే నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు.




## ఎంబిబిఎస్ సీట్లు దక్కించుకోవడంతో గిరిజన జాతికి గర్వకారణం.

**గిరిజన పేద కుటుంబంలో విద్యా కుసుమాలు.**

**ఒకే ఇంట్లో అన్నదమ్ముల ఇద్దరికి మెడిసిన్ సీట్లు.**

**కష్టపడి చదివితే అందలం ఎక్కడం కష్టమేమీ కాదంటున్న గిరిజన విద్యార్థులు.**

**ప్రశంసిస్తున్న గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్.**



**ఆంధ్ర ప్రగతి పాణ్యం నవంబర్ 11:**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మారుమూల గిరిజన ప్రాంతాలకు చెందిన నంద్యాల జిల్లా వాసులు ఎంబిబిఎస్ చెట్లు దక్కించుకోవడంతో యావత్ గిరిజన జాతికే గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ కొనియాడారు.

మంగళవారం పాణ్యం మండలం కాటసాని రాంభూపాల్ రెడ్డి తండకు కు చెందిన కృష్ణ నాయక్ అలియాస్ కిట్ట శాంతి బాయి లకు జన్మించిన ఇద్దరు కుమారులు 2005 సంవత్సరం మెడిసిన్ లో ఎంబిబిఎస్ సీట్లు దక్కించుకున్నారు. ఒకే కుటుంబంలో గిరిజన విద్య కుసుమాలు ఎంబిబిఎస్ సీట్లు దక్కించుకోవడం యావత్ గిరిజన జాతికే గర్వకారణమని పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ మరియు రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్ రాంభూపాల్ రెడ్డి తాండకు చేరుకొని వారి కుటుంబానికి అభినందించి శాలువతో సత్కరించారు.

ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ గిరిజన కుటుంబాలు రెక్కాడితే డొక్కాడని పరిస్థితుల్లో ఆ కుటుంబం ఉన్నాయని

మారుమూల గిరిజన ప్రాంతాల్లో జన్మించి ఇద్దరి కుమారులను కూలి పనులు చేసుకొని గౌండ పని చేసుకుంటూ తమ పిల్లలను చదివించుకుంటూ ఎన్నో కష్టాలు పడి వారి భవిష్యత్తుకు దారి చూపిస్తూ ఇబ్బందులు పడ్డారన్నారు. ఇప్పటికీ సొంత ఇల్లు లేక ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబం కు మెడిసిన్ లో ఎంబిబిఎస్ సీట్లు సొంత జిల్లాకు కర్నూల్ లోనే కుమారులకు రావడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. ఆ కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకొని సహాయ సహకారాలు అందించాలని రాజు నాయక్ కోరారు.

## రాష్ట్రస్థాయిలో 2వ స్థానంలో నంద్యాల మెప్మా.

### సిబ్బంది కృషి : పీడీ వెంకటదాస్.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 11:**
రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల మధ్య నంద్యాల మెప్మా కార్యాలయం ప్రతిష్టాత్మకంగా రెండవ స్థానం సాధించింది. అన్ని విభాగాల పనితీరు, లక్ష్యాల సాధన, స్త్రీ సంఘాల అభివృద్ధి, ఆర్థిక పారదర్శకత వంటి అన్ని పారామీటర్లలో మెరుగైన ఫలితాలు సాధించడం ద్వారా ఈ ఘనత దక్కినట్టు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటదాస్ తెలిపారు. జిల్లా స్థాయిలో సమష్టి కృషితో సిబ్బంది, కమ్యూనిటీ ఆర్గనైజర్లు. సిటీ మిషన్ మేనేజర్లు సీఆర్పీలు. అందరూ ఒక టీమ్‌లా పనిచేసినందుకు ఈ విజయం సాధ్యమైందన్నారు. రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలవడం నంద్యాల మెప్మాకు గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ప్రథమ స్థానం సాధించేందుకు మరింత కృషి చేయాలని సిబ్బందికి పీడీ వెంకటదాస్‌గారు పిలుపునిచ్చారు. నాణ్యతా ప్రమాణాలు, పారదర్శకత, సామాజిక బాధ్యతతో పనులు కొనసాగించాలని సూచించారు. నంద్యాల మెప్మా రాష్ట్రస్థాయిలో విశేష గుర్తింపు పొందిన నేపథ్యంలో పలువురు అధికార, ప్రజాప్రతినిధులు పీడీ వెంకటదాస్‌గారికి అభినందనలు తెలిపారు.

## పర్యాటకరంగ అభివృద్ధికి స్థలాల పరిశీలన.

### -జిల్లా కలెక్టర్ జి రాజకుమారి.





**ఆంధ్ర ప్రగతి సున్నిపెంట/నంద్యాల, నవంబర్11:**
సున్నిపెంట ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికు అనువైన ప్రాంతాలను గుర్తిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జి రాజకుమారి అన్నారు. మంగళవారం నంద్యాల జిల్లా శ్రీశైలం మండలంలోని సున్నిపెంట ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికి అనువైన ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సున్నిపెంట ప్రాంతంలో పర్యాటక రంగ అభివృద్ధికి అనువైన ప్రదేశాలను గుర్తించే క్రమంలో భాగంగా సుమారు 49 ఎకరాల స్థలాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. సున్నిపెంట శ్రీశైలం సమీప ప్రాంతం కావడంతో, ఇక్కడ పర్యాటక రంగ అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాంతాన్ని ఆధునిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. పరిశీలించిన 49 ఎకరాల స్థలంలో హెూటళ్లు, రిసార్టులు, పార్కులు, పర్యాటక సదుపాయాలు, సాంస్కృతిక కేంద్రాలు వంటి మౌలిక వసతులు ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రాంతంలో పర్యాటక వసతులు విస్తరించడం ద్వారా భక్తులు, పర్యాటకులకు మరింత సౌకర్యాలు లభించడంతోపాటు స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయన్నారు. పర్యాటక అభివృద్ధి కేవలం ఆర్థిక పరంగా కాకుండా, సామాజిక, సాంస్కృతిక ప్రగతికి కూడా దోహదపడుతుందని కలెక్టర్ తెలిపారు. ఆత్మకూరు ఆర్‌డీఓ నాగజ్యోతి, టూరిజం శాఖ అధికారులు, తహసీల్దార్, తదితర అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి.

**రసాయనక ఎరువుల వాడకం తగ్గించాలి. -జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు.**





**ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 11:**
రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందే విధానాలను తెలుసుకోని, వ్యవసాయంలో సుస్థిరతను సాధించాలని జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మహానంది మండలం గాజులపల్లి గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు రసాయనక ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ, జీవన ఎరువులను వాడుట ద్వారా నేల, మానవాళి ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. రైతులు తాము వేసే పంటలలో సూక్ష్మ పోషకాల లోపం రాకుండా చూసుకోవాలన్నారు. వరి పంటలో ఎకరాకు 20 కిలోల ముడి జింకు వాడాలని, జింకును భాస్వరం ఎరువులతో కలిపి వాడరాదన్నారు. వరిలో పై పాటుగా కాంప్లెక్స్ ఎరువులు వాడరాదని, జీవన ఎరువులు వాడేటప్పుడు రసాయనిక ఎరువులు, పురుగుమందులతో కలిపి వాడరాదని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకుని రైతులు 11 అంకెల విశిష్ట సంఖ్యను పొందాలని, ముందు ముందు భవిష్యత్తులో ఈ విశిష్ట సంఖ్య ఉన్న రైతులకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. గోపవరం సొసైటీ చైర్మన్ గంగవరపు మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. మొక్కజొన్న, వరి కొనుగోలు కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. యూరియా ఎరువులు ఎప్పటికప్పుడు రైతులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, పశు వైద్యులు శివానంద్, గ్రామ ఉద్యాన అధికారి విశ్వద, శ్రీశైలం దేవస్థానం మాజీ ధర్మకర్త రవి స్వామి, రైతులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# శ్రీశైలంలో 4 స్టార్ హెూటల్ భవన నిర్మాణానికి భూమి పూజ.

**83 కోట్ల వ్యయంతో 126 రూములు కలిగిన ఆధునిక 4 స్టార్ హెూటల్ నిర్మాణం.**







**ఆంధ్ర ప్రగతి శ్రీశైలం / నంద్యాల, నవంబర్ 11:**
శ్రీశైల మహా పుణ్యక్షేత్రంలో రూ. 83 కోట్ల వ్యయంతో 126 రూములు కలిగిన ఆధునిక 4 స్టార్ హెూటల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్దన్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రకాశం జిల్లా కనిగిరిలోని పెదఈర్లపాడు నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా 4 స్టార్ హెూటల్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డితో పాటు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, దేవస్థానం చైర్మన్ పి. రమేష్ నాయుడు, ఈవో ఎం. శ్రీనివాసరావు, శ్రీ వెంకటేశ్వర గ్రూప్స్ వ్యవస్థాపకులు రామస్వామి వెంకటరమణ, ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ శ్రీశైలంలో భక్తుల అవసరాలకు అనుగుణంగా స్టార్ హెూటల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామన్నారు.



ఇందులో భాగంగానే రూ. 83 కోట్ల వ్యయంతో 126 రూములు కలిగిన ఆధునిక 4 స్టార్ హెూటల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. నంద్యాల జిల్లా శ్రీశైలంలో శ్రీ వెంకటేశ్వర గ్రూప్స్ ఆధ్వర్యంలో నిర్మించబోయే 4 స్టార్ హెూటల్ భవన నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం ఘనంగా జరిగిందన్నారు. దాదాపు 1.5 ఎకరాల స్థలాన్ని 33 సంవత్సరాల లీజుకు శ్రీ వెంకటేశ్వర గ్రూప్‌కు కేటాయిస్తున్నామన్నారు. హెూటల్ నిర్మాణానికి ముందుకు వచ్చే పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం లీజుకు స్థలం కేటాయించి అభివృద్ధిలో భాగస్వాములుగా చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో ప్రసిద్ధి గాంచిన శ్రీ వెంకటేశ్వర గ్రూప్ శ్రీశైలంలో హెూటల్ నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమని మంత్రి అన్నారు. 18 నెలల కాల పరిమితిలో ఈ ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలని సూచించారు. ఈ హెూటల్ నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం కేవలం వ్యాపార దృక్పథంలో చూడడం లేదని స్థానిక యువతకు ఉపాధి, పర్యాటక రంగానికి ఉత్సాహం, శ్రీశైలం అభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ శ్రీశైలం కేవలం ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం మాత్రమే కాదు, పర్యాటక అభివృద్ధికి కేంద్రబిందువుగా మారే సామర్థ్యం కలిగిన ప్రాంతమన్నారు. 4 స్టార్ హెూటల్ భవన నిర్మాణం పూర్తయితే భక్తులు పర్యాటకులకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 300 మందికి ప్రత్యక్షంగా, 1,200 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనుందన్నారు. అనంతరం మంత్రి , జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే ఇతర ప్రజాప్రతినిధులు నిర్మాణ స్థలాన్ని పరిశీలించి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.

**ప్రతి విద్యార్థి వారి లక్ష్యం వైపు అడుగులు వేయాలి.**




**ఆంధ్ర ప్రగతి బేతంచెర్ల నవంబర్ 11:**
నంద్యాల జిల్లా బేతంచెర్ల మండల కేంద్రంలో ఉన్న గోరుమానుకోండ ఏపీ మెడల్ స్కూల్ లో ర్యాగింగ్ వద్దు - స్నేహం ముద్దుఆత్మ హత్యలు వద్దు - బ్రతికి సాధిద్దాం"అనే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్వీఎఫ్ జిల్లా కార్యదర్శి బాలక్రిష్ణ నాయక్ అధ్యక్షత వహించడం జరిగింది. ఈ సందర్బంగా రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి రవీంద్ర నాథ్, ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు నాగ సురేంద్ర యాదవ్,లు మాట్లాడుతూ.. ర్యాగింగ్ ల పైన రాష్ట్ర ప్రభుత్వం ఒక చట్టాన్ని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు, అంతె కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అనేక విద్యాసంస్థలలో విద్యార్థులు అనేక కారణాలతో చాలా మంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు అని అన్నారు.మన దేశం లో రోజు రోజుకు విద్యార్థుల ఆత్మ హత్యలు ఎక్కువైపోతున్నాయి వాటిని తగ్గించడానికి విద్యార్థుల లో ధైర్యాన్ని పెంపొందించడానికి అనేక రూపాలలో విద్యార్థుల కోసం అవగాహనా సదస్సులు లాంటివి ఆర్వీఎఫ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించడం జరుగుతుంది, అని అన్నారు.అదేవిధంగా చట్టలపైన అవగాహనా రావలని ప్రతి ఒకరు రాజ్యాంగంను గౌరవించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వచ్చిన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళ ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి , బేతంచెర్ల మండల విద్యాశాఖ అధికారి సోమశేఖర్ లు హాజరయ్యారు అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు అనేక రూపాలలో అన్యాయం జరుగుతూనే ఉంది రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ఎన్ని చట్టాలు తెచ్చిన న్యాయంమాత్రం జరగడంలేదని మహిళలు మహిళా హక్కులు చట్టాల గురించి ప్రతిఒక్కరూ తేలుసుకోవాలని వారు అన్నారు.అదెవిధంగా చిన్న వయసు లోనే బాల్యవివాహాలు చేయడంవల్ల వారు బంగారు భవిష్యత్తు కోల్పోతున్నారు అని అలాగే విద్యకు దూరం అయిపోతున్నారు అని అన్నారు. అలాగే మహిళా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు.
ఈ కార్యక్రమం లో ఏపీ మెడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియదాస్ . ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళ ఐక్య వేదిక నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి కటికే భాను,కన్యాకుమారి . ఎపి మెడల్ స్కూల్ స్టాఫ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న
# హెూటళ్ల యాజమాన్యాలు.

**కల్తీ ఆహారయి ప్రజల ప్రాణాలతో చెలగాటం.**

**మామూళ్ల మత్తులో ఫుడ్ సేఫ్టీ అధికారులు.**

**కల్తీ ఆహారంపై ఉక్కు పాదం మోపే అధికారులే లేరా.?**


**ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 11:**
నంద్యాల పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసినటువంటి ఏఐవైఎఫ్ ముఖ్య నాయకుల సమావేశంలో ఏఐవైఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రంలో ఉన్నటువంటి హెూటల్స్ యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఫుడ్ సేఫ్టీ అధికారుల నియమ నిబంధనలు పాటించకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కుళ్ళిన ఆహార పదార్థాలను, కూలిన మాంస పదార్థాలను వడ్డిస్తూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కొన్ని హెూటళ్లపై ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేసినప్పటికీ అక్కడ కూలిన మాంసం, కుళ్ళిన ఆహార పదార్థాలు పై నిషేధం విధించినప్పటికీ మరలా తిరిగి నంద్యాల పట్టణంలో ఉన్నటువంటి హెూటల్స్ యాజమాన్యాలు అవే పద్ధతులు పాటిస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతూ ప్రజల ప్రాణాలతో డబ్బులు సంపాదిస్తున్నారని అంశాలు పునరావడం అవుతున్నప్పటికీ నంద్యాల హెూటల్స్ యాజమాన్యాలు అదే పద్ధతి కొనసాగిస్తున్నప్పటికీ ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆ హెూటల్స్ యాజమాన్యం నుండి వచ్చేటువంటి డబ్బులు తీసుకొని మామూలు మత్తులో పడి ఎటువంటి చర్యలు తీసుకోకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కావున తక్షణమే నంద్యాల జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు జిల్లా కలెక్టర్ గారు స్పందించి ప్రైవేట్ హెూటల్ లో జరుగుతున్నటువంటిఫుడ్ దందాపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకొని, ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ, వివిధ రకాల కెమికల్స్ వాడుతూ కుళ్ళిన మాంసాలను వాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పాడు చేస్తున్న హెూటల్స్ నడుపుతున్నటువంటి యాజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ప్రజల జీవితాలతో చెలగాటం ఆటమాడుతున్నటువంటి హెూటల్స్ పై ప్రత్యక్ష ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

## శ్రీ కొత్తూరు సుబ్బరానికి 350 గ్రాముల
# వెండి శూలము వితరణ..!

**ఆలయ ఈవో యం. రామక్రిష్ణ.**



**ఆంధ్ర ప్రగతి ఎస్ కొత్తూరు పాణ్యం నవంబర్ 11:**
ప్రముఖ శైవక్షేత్రం నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారికి 350 గ్రాముల వెండి శూలమును భక్తులు విరాళంగా ఆదివారం ఇచ్చినట్లు ఆలయ ఈవో యం. రామకృష్ణ తెలిపారు. మిడుతూరు మండలం పీర్సాపేట గ్రామానికి చెందిన వెంకట లక్ష్మయ్య అను భక్తుడు స్వామి వారు వారికి ఇంటి ఇలవేల్పు కావడంతో 350 గ్రాముల వెండి శూలమును విరాళంగా ఇచ్చారని వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదము వితరణ చేశారు.

# ఏపీ మోడల్ స్కూల్ కు విద్యార్థి బస్సు ఏర్పాటు చేయాలి.



**ఆంధ్ర ప్రగతి పాములపాడు నవంబర్ 11:**
పాములపాడు మండలంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు విద్యార్థి బస్సును ఏర్పాటు చేయాలని ఆత్మకూర్ డిపో మేనేజర్ వినయ్ కుమార్ కు వినతి పత్రం అందజేసిన విద్యార్థి నాయకులు. ఈ సందర్భంగా బహుజన స్టూడెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పాలుట్ల రమణ మరియు జిల్లా అధ్యక్షులు పెద్ద స్వామి మాట్లాడుతూ.. స్థానిక పాములపాడు మండలంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులకు విద్యార్థి బస్సును ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. మోడల్ స్కూల్లో ఉన్న విద్యార్థులు సుమారు 650 మంది ఉన్నారు కానీ ఇంతవరకు విద్యార్థులకు ఒక విద్యార్థి బస్సును ఏర్పాటు చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పాములపాడు మండలంలో నుండి వందలది మంది విద్యార్థులు వస్తున్నారు కానీ ముఖ్యంగా అమ్మాయిలకు బస్సులో నిలబడడానికి కూడా స్థలం లేక ఇబ్బంది పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు విద్యార్థి బస్సులు ఏర్పాటు చేయాలని వారు కోరారు. అదేవిధంగా డిపో మేనేజర్ స్పందించి విద్యార్థులకు విద్యార్థి బస్సును ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది.

# ఏసీబీ వలలో అవినీతి చేప..

## డోన్ డిప్యూటీ తహశీల్దార్ సునీల్ రాజు.

**రూ.35 వేల లంచం స్వీకరిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్ట్.**

**ఎమ్మార్వో కార్యాలయంలో ఏసీబీ సోదాలు.-కార్యాలయం సిబ్బందిలో కలకలం.**






**ఆంధ్ర ప్రగతి డోన్ నవంబర్ 11:**
డోన్ పట్టణంలో అవినీతి మూలాలు వెలికితీయడంలో ఏసీబీ అధికారులు మరోసారి సత్తా చాటారు. ఎమ్మార్వో కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ సునీల్ రాజు, ఓ రైతు భూ సమస్య పరిష్కారానికి రూ. 35,000 లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో, వారు మంగళవారం పద్ధతి ప్రకారం వల వేయడం జరిగింది. ముందస్తు ఏర్పాట్లతో అధికారులు డోన్‌కు చేరుకుని, డిప్యూటీ తహశీల్దార్ సునీల్ రాజు లంచం తీసుకుంటున్న క్షణంలోనే రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సునీల్ రాజు వద్ద నుండి డబ్బును స్వాధీనం చేసుకున్న ఏసీబీ అధికారులు, తదనంతరం ఎమ్మార్వో కార్యాలయంలో విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ ఘటనతో కార్యాలయం సిబ్బందిలో ఒకింత భయాందోళన నెలకొంది. అధికారులు సునీల్ రాజును అరెస్ట్ చేసి, విచారణ నిమిత్తం ఏసీబీ కార్యాలయానికి తరలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు వెలుగులోకి రానున్నాయి. డోన్ పట్టణంలో ఏసీబీ దాడులు కలకలం. రూ. 35 వేల లంచం స్వీకరిస్తుండగా పట్టుబడ్డ డిప్యూటీ తహశీల్దార్మ్మార్వో కార్యాలయంలో అధికారుల విస్తృత సోదాలుఇలాంటి అవినీతి ఘటనలు వెలుగులోకి రావడంతో ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. స్థానికులు అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఎస్ఐఆర్ అమలు నిలిపివేయాలి.

**దిల్లీ పేలుళ్ల బాధ్యులపై కఠిన చర్యలు.**

**రాష్టాభివృద్ధికి తోడ్పడేలా సీఐఐ భాగస్వామ్య సదస్సు ఉండాలి.**

**అసైన్డ్ చట్టసవరణ దారుణం.**

**-సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య**

**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా నవంబర్ 11:**
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) రాష్ట్రంలో అమలు చేయడాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వరయ్య తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్ఆర్ఐ అశం సుప్రీం పరిధిలో ఉన్నందున తక్షణమే రాష్ట్రంలో అమలును నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేశారు. దీనిపై తక్షణమే రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించి, అభిప్రాయ సేకరణ చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక సమగ్ర సవరణ చేయాలని ఆదేశాలిచ్చిన 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లేకపోయినప్పటికీ..ఇక్కడ ఎస్ఐఆర్ అమలుకు సన్నద్ధం కావడం తగదన్నారు. ఎస్ఐఆర్ అమలు నిలిపివేతకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఒక వైపు బీహార్‌లో ప్రత్యేక సమగ్ర సవరణతో దేశ వ్యాప్తంగా అనేక అభ్యంతరాలు, నిరసనలు వెల్లువెత్తాయని వివరించారు. దాన్ని గమనించకుండా ఎన్ఆర్ఐ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం ఆసక్తి చూపడం తగదని, బీహార్ ఎన్నికలను వివాదస్పదంగా మార్చడం కోసమే తెరపైకి దీన్ని




తెచ్చారన్నారు. ఈ అంశంపై వైసీపీ తన వైఖరిని వెల్లడిరచాలని సూచించారు. టీడీపీ గతంలో ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించి.. రాష్ట్రంలో ఇప్పుడు అమలుకు దిగడాన్ని తప్పుపట్టారు. దిల్లీ పేలుళ్ల ఘటన దురదృష్టకరమని, బాధ్యులైన దుండగులను తక్షణమే అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలనిడిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన సంతాపం ప్రకటించారు.
రాష్ట్ర పురోగాభివృద్ధికి దోహదపడేలా విశాఖలో సీఐఐ భాగస్వామ్య సదస్సు అజెండాను మార్చాలన్నారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా..ఈ సదస్సుకు అర్థం లేదని, రాష్ట్రాభివృద్ధికి తోడ్పడే పెట్టుబడులను, విధానాల్ని ఆహ్వానించాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రజలు, కార్మికులకు నష్టం కలిగించే విధానాల్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తామన్నారు. సీఐఐ సదస్సులో కార్మికుల సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధి ఉపాధి కల్పన, భద్రత అంశలను చేర్చాలని కోరారు.
పీపీపీ విధానంలో ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని, దీనిపై వస్తున్న నిరసనలను ప్రభుత్వం గుర్తించి...వెనక్కి తగ్గాలని కోరారు. పీపీపీ విధానం వల్ల ప్రధానంగా రిజర్వేషన్ వర్గాలకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. అసైన్డ్ చట్ట సవరణ వల్ల పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, వాటిని ధనికులకు లీజుకిస్తూ ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని ఉప సంహరించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే చాలా అసైన్డ్ భూములను పేదల నుంచి బలవంతంగా లాక్కున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములు పేదల సాగులో ఉన్నప్పటికీ..వారికి కూటమి ప్రభుత్వం రెవెన్యూ హక్కులు కల్పించకుండా చాలా ఇబ్బందులు పెడుతోందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. మొంథా తుపానుతో రాష్ట్రంలో రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని, చేతికొచ్చిన పంటలు దెబ్బతిని నిరాశ్రయులయ్యారని, వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఉచిత పంటల బీమా పథకం ప్రారంభించాలని, కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
బుధవారం 12 నవంబర్ 2025

# అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంటలను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ నవంబర్ 11:** నంద్యాల నియోజకవర్గం గోస్పాడు మండలంలోని సాంబవరం గ్రామంలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల వరి పంట నష్ట పోవడం జరిగింది. నేడు మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి గోస్పాడు మండలం సాంబవరం గ్రామ రైతులతో కలిసి నష్ట పోయిన వరి పంటను పరిశీలించడం జరిగింది. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి నష్ట పోయిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆయనతోపాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పిపి మధుసూదన్ రెడ్డి, వైఎస్ఆర్సిపి గోస్పాడు మండల అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి, జిల్లా వైఎస్ఆర్సిపి మేధావుల విభాగం అధ్యక్షుడు రసూల్ ఆజాద్, గ్రామ వైసిపి నాయకులు శంకర్ రెడ్డి , శ్రీను, రైతులు పాల్గొన్నారు.మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొంటూ.. మంత్రి ఉండి కూడా నియోజకవర్గంలో రైతులు ఆకాల వర్షాలతో పంటలు తీవ్రంగా నష్టపోతే వారికి ప్రభుత్వం తరుపున ఎటువంటి న్యాయం చేయకపోవడం పై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, పంటలు నష్టపోయిన ప్రతి ఒక్క రైతును ఆదుకోవాలని కోరారు. అనంతరం కౌలు రైతులు మాట్లాడుతూ.. దాదాపు 50 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని ఎంతో కష్టపడి పంటలు వేసుకుంటే అకాల వర్షాల వల్ల పంట అంతా నష్టపోవడం జరిగిందని, ఇంతవరకు అధికారులు ఎటువంటి న్యాయం చేయలేదని వాపోయారు. ప్రభుత్వం మాకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య శరణ్యం అని ఆవేదన చెందారు.

# నవంబర్ 28,29 వ తేదీల్లో జరిగే పి డి ఎస్ యు రాష్ట్ర 24వ మహాసభలు జయప్రదం చేయండి.

**పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు షైక్ షాహీద్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 11:**
ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడి ఎస్ యు) రాష్ట్ర 24వ మహాసభలు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నవంబర్ నెలలో 28,29వ తేదీ న జరుగుతున్న సభను విజయవంతం చేయాలని పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు షైక్ షాహీద్ పిలుపునిచ్చారు.
ఈరోజు నంద్యాల పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పి డి ఎస్ యు రాష్ట్ర మహాసభలో గోడపత్రికలు విడుదల చేయడం జరిగింది..ఈ సందర్భంగా పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షులు షైక్ షాహీద్ మాట్లాడుతూ పిడి ఎస్ యు గత 51 సంవత్సరాలుగా విద్యార్థుల హక్కుల కోసం సమాజ మార్పు కోసం పిడి ఎస్ యు నిరంతరం కృషి చేస్తుంది అన్నారు.జాతీయంగా, అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలు పైనా, సామ్రాజ్యవాద విషసంస్కృతికి వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు నిర్వహించిందని అన్నారు. ఎన్నికల సమయంలో విద్యార్థులకు అనేక హామీ ఇచ్చి మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేద విద్యార్థుల కష్టాలు తీరుస్తామని చెప్పిన ప్రస్తుత విద్యాశాఖ మంత్రి ఎన్నికలలో విద్యార్థులకు ఇచ్చిన హామీ ఏ ఒక్కటి కూడా అమలు చేయలేదని కూటమి ప్రభుత్వం పైన మండిపడ్డారు. మన ప్రభుత్వం అధికారంలోకి వస్తే నెల రోజుల్లో పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు 6400 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చిన నారా లోకేష్ ఆ హామీ దాదాపు ఒకటిన్నర సంవత్సరం ప్రభుత్వ పరిపాలన పూర్తవుతా ఉన్నా నేటికీ కేవలం హామీగానే మిగిలిపోయింది తప్ప అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో తుతు మంత్రంగా విడుదల చేసి అవి పేపర్ ప్రకటనలకే పరిమితమయ్యాయని మండిపడ్డారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ చేసిందని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గగ్గోలు పెట్టిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేడు మీరు అధికారంలోకి వచ్చిన తర్వాత 100% మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్న ఎన్డీఏ ప్రభుత్వమని పేర్కొన్నారు. ప్రభుత్వ వసతి గృహాలలో విద్యార్థులకు నాణ్యమైనటువంటి వసతులు లేక సరైనటువంటి ఆహారం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హాస్టల్స్ లో విద్యార్థులకు సరిపడ గదులుగాని బాత్రూమ్ లేవన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉన్నత విద్యను దూరం చేసే విధంగా వైసిపి ప్రభుత్వం జీవో నెంబర్ 77 తీసుకుని వస్తే మన ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే వందరోజుల్లో రద్దు చేస్తామని హామీ ఇచ్చిన నారా లోకేష్ గారు నేడు ఒకటిన్నర సంవత్సరం పూర్తి అవుతా ఉన్న జీవో నెంబర్ 77 రద్దు చేయలేదని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాల విశ్వవిద్యాలయాలలో ఖాళీగా ఉన్న టీచర్ లెక్చరర్ ప్రొఫెసర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పిడిఎస్యు నంద్యాల పట్టణ నాయకులు ధను ,బాలాజీ,సుధీర్,వినయ్,వంశీ,బాలు ,హరి, విద్యార్థి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం.

**సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫీ. -యన్ కొత్తపల్లె హై స్కూల్ హెడ్మాస్టర్ పి బి ఎస్. ప్రసాద్ రెడ్డి.**







**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ నవంబర్ 11:**
నంద్యాల మండలం యన్ కొత్తపల్లె జడ్పీహెచ్ఎస్ స్కూల్ నందు సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫీ ఆద్వర్యంలో స్కూల్ హెడ్మాస్టర్ పి బి ఎస్. ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మన భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రి శ్రీ మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారి జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు.వారిని స్మరించుకున్నారు.
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లారెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్కూల్ హెడ్మాస్టర్ ఆర్ బి ఎస్. ప్రసాద్ రెడ్డి,ఉపాద్యాయులు మల్లారెడ్డి,సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫీ మాట్లాడుతూ..
మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫీ కోరారు.
శ్రీ మౌలానా అబుల్ కలాం ఆజాద్ నవంబర్ 11, 1888 న జన్మించారు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఈయన అసలుపేరు మొహియుద్దీన్ అహ్మద్. 'అబుల్ కలాం' అనేది బిరుదు 'ఆజాద్' కలంపేరు. వీరి తల్లిదండ్రులు ఆలియా బేగమ్, ఖైరుద్దీన్ అహమ్మద్. ఈయన ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని చాలా సంవత్సరాలపాటు జైలుశిక్ష అనుభవించాడు. భారత ప్రభుత్వంలో 11 సంవత్సరాలపాటు విద్యాశాఖామంత్రిగా పనిచేసాడు. 1992లో భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న ఇచ్చి గౌరవించింది.ఈయన జన్మదినమైన నవంబరు 11 ను జాతీయ విద్యాదినోత్సవంగా జరుపుకుంటారు. 1958 ఫిబ్రవరి 22 న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ కన్నుమూశారు.మన మందరం స్వాతంత్ర్య సమరయోధుల అడుగుజాడలలో నడుద్దామని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫీ స్కూల్ హెడ్మాస్టర్ ఆర్ బి ఎస్ ప్రసాద్ రెడ్డి, ఉపాద్యాయులు మల్లారెడ్డి కోరారు.

# ఉర్దూ భాష అభ్యున్నతికి కృషి చేయాలి



**ఆంధ్ర ప్రగతి మహానంది నవంబర్ 11:**రాష్ట్రంలో అధికార రెండవ భాష ఉర్దూ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన బాధ్యత ఉందని మహానంది మండలం జనసేన పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం భారతదేశ మొట్టమొదటి కేంద్ర విద్యా శాఖ మంత్రి అబుల్ కలం ఆజాద్ జయంతి సందర్భంగా, మైనార్టీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్య దినోత్సవం కార్యక్రమంలో భాగంగా మహానంది మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో మహానంది మండలం గాజులపల్లె గ్రామంలోని ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాల హెడ్మాస్టర్ అరుణ కుమారి తో పాటు ఉర్దూ భాషలో బోధించే నలుగురు ఉపాధ్యాయులను శాలవులు కప్పి అభినందించారు. వారు మాట్లాడుతూ.. ఉర్దూ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేసి ఉర్దూ అభ్యున్నతికి చేయూతనివ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గాజులపల్లె జనసేన నాయకులు మహేంద్ర, రవి కుమార్, విజయ్, నరసింహ రమణ మురళి తో పాటు మండల జనసేన నాయకులు మురళి ప్రసాదు చక్రపాణి, కాకర్ల శివ ,రామచంద్రుడు, జంగం మహేష్, రామకృష్ణ చందు, మహేష్, నాగేషు పలువురు జనసేన నాయకులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలపై మెరుపు సమ్మె నోటీసు.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల అర్బన్ నవంబర్ 11:** మున్సిపల్ కార్మికుల సమస్యలపై మెరుపు సమ్మె నోటీసును మున్సిపల్ కమిషనర్ శేషన్న కు ఈరోజు ఇవ్వడం జరిగింది. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా మాజీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ మురళీధర్ ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు భూమని శ్రీనివాసులు డి శ్రీనివాసులు మున్సిపల్ వర్కర్ సీనియర్ జిల్లా కార్యదర్శి ఓబులేసు నాయకులు రంజిత్ ప్రతాప్ శివ రాముడు మస్తాన్ ఉన్నారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డిమాండ్స్ విస్టింగ్ కార్డులు దండలు మొదలగు సామాగ్రి 60 సంవత్సరములు దాటిన వారి స్థానంలో వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం నంద్యాల జిల్లా అయింది కాబట్టి అదనంగా కార్మికులను తీసుకోవాలని కనీసం వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని మహిళలకు 15 క్యాజువల్ లివులు మున్సిపల్ కార్మికులకు పిఎఫ్ ఈఎస్ఐ కార్మికులకు సబ్బులు చెప్పులు కొబ్బరి నూనె యూనిఫారం తక్షణమే మంజూరు చేయాలని గుర్తింపు కార్డు ఇవ్వాలని తదితర డిమాండ్లతో ఇవ్వడం జరిగింది.

# ఢిల్లీలో పేలుడు సంఘటన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం.

**జిల్లాలో రద్దీ ప్రాంతాలలో ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు.**

**జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షొరాణ్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ నవంబర్ 11:** ఢిల్లీలో ఎర్రకోట దగ్గర భారీ పేలుడు నేపథ్యంలో నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ సునీల్ షొరాణ్ జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా అన్ని ముఖ్యమైన కూడళ్ళు , ప్రజలు రద్దీగా సంచరించే ప్రదేశాలలో,బస్టాండ్ లో ,రైల్వేస్టేషన్ లు మొదలగు ప్రాంతాల్లో ఏకకాలంలో ముమ్మరంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్బంగా పోలీస్ అధికారులు ప్రజల భద్రత , శాంతి భద్రతల పరిరక్షణే ద్యేయంగా సోమవారం రాత్రి జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్.నంద్యాల పట్టణ కేంద్రంలోని రైల్వే స్టేషన్,బస్టాండ్ , ముఖ్యమైన కూడళ్లలో స్వయంగా పర్యటించి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు.భారీ పేలుడు సంఘటన నేపథ్యంలో, జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు బృందాలు విస్తృతంగా వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. బస్ స్టాండ్ లలో, రైల్వే స్టేషన్ లలో అనుమానస్పద లగేజ్ లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

# టిడిపి నాయకుడు చాంద్ రెబల్ పుట్టినరోజు వేడుకలకు హాజరైన ఎన్ఎండి ఫిరోజ్.




**ఆంధ్ర ప్రగతి నంద్యాల నవంబర్ 11:**నంద్యాల 17వ వార్డుకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, యువకులకు ఆదర్శప్రాయుడైన చాంద్ రెబల్ పుట్టినరోజు వేడుకలు విశ్వనగర్ నందు అత్యంత ఘనంగా, ఆనందోత్సవాల మధ్య నిర్వహించబడ్డాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ఎమ్.డి. ఫిరోజ్ హాజరయ్యారు. చాంద్ రెబల్ కి సంబంధించిన మిత్రులు, అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఎన్.ఎమ్.డి. ఫిరోజ్ మాట్లాడుతూ చాంద్ రెబల్ పార్టీ పట్ల , ప్రజల పట్ల చూపుతున్న నిబద్ధతను, సేవాభావాన్ని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఆయన మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎన్.ఎమ్.డి. ఫిరోజ్ చాంద్ రెబల్ తో కలిసి కేక్ కట్ చేసి, వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

# సున్నిపెంటలో దేవస్థాన సిబ్బందికి నిర్మించిన క్వార్టర్స్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్.



**ఆంధ్ర ప్రగతి సున్నిపెంట/నంద్యాల, నవంబర్11:**
సున్నిపెంట ప్రాంతంలో శ్రీశైలం దేవస్థాన సిబ్బందికి నిర్మించిన నివాస క్వార్టర్స్‌ను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ క్వార్టర్స్ భవన నిర్మాణ నాణ్యత, సౌకర్యాల అందుబాటు, భద్రతా ప్రమాణాలు, పరిసరాల శుభ్రత వంటి అంశాలను సమీక్షించారు. నిరంతరం భక్తులకు సేవలందించే దేవస్థాన సిబ్బందికి తగిన వసతి, సౌకర్యాలు కల్పించడం ప్రాధాన్యత అంశం అన్నారు. క్వార్టర్స్ నిర్మాణం నాణ్యంగా, సమయానికి పూర్తి కావడంతోపాటు విద్యుత్, నీటి సరఫరా, పారిశుధ్య సదుపాయాలు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శ్రీశైలం వంటి ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతంలో పనిచేసే సిబ్బందికి మెరుగైన వసతులు కల్పించడం ద్వారా వారు మరింత నిబద్ధతతో సేవలు అందించగలుగుతారన్నారు. నిర్మాణ ప్రగతి, వినియోగంలో ఉన్న భవనాల స్థితి, పునరుద్ధరణ అవసరాలపై ఇంజనీరింగ్ విభాగ అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# ఢిల్లీ పేలుళ్లకు 3 గంటల ముందే 'రెడ్డిట్'లో పోస్ట్..

## వైరల్ అవుతున్న విద్యార్థి హెచ్చరిక!

### ఎర్రకోట వద్ద భారీ భద్రతపై అనుమానం వ్యక్తం చేసిన 12వ తరగతి విద్యార్థి

### సాయంత్రం 4 గంటలకు పోస్ట్

### రాత్రి 7 గంటల సమయంలో కారు బాంబు పేలుడు



**ఢిల్లీనవంబర్ 11 ఆంధ్ర ప్రగతి**
దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుళ్లకు సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ దుర్ఘటన జరగడానికి కేవలం మూడు గంటల ముందు, ఒక విద్యార్థి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'రెడ్డిట్'లో పెట్టిన పోస్ట్ ఇప్పుడు తీవ్ర కలకలం రేపుతోంది. పేలుడు జరిగిన ప్రదేశంలో భారీగా భద్రతా బలగాలను మోహరించడంపై అతను ఆ పోస్ట్‌లో అనుమానం వ్యక్తం చేశాడు.
12వ తరగతి చదువుతున్నట్లు చెప్పుకున్న ఒక విద్యార్థి, సాయంత్రం 4 గంటల సమయంలో 'ఢిల్లీలో ఏదో జరగబోతోందా?' అంటూ ఒక పోస్ట్ పెట్టాడు. "నేను ఇప్పుడే స్కూల్ నుంచి వచ్చాను. ఎర్రకోట, మెట్రో స్టేషన్ల వద్ద ఎన్నడూ లేనంతగా పోలీసులు, ఆర్మీ సిబ్బంది, మీడియా కనిపిస్తున్నారు. మెట్రోలో ప్రయాణిస్తున్నప్పుడు కూడా నేను ఇంతమంది సైన్యాన్ని ఎప్పుడూ చూడలేదు. అసలు ఇక్కడ ఏం జరుగుతోంది?" అని ఆ పోస్ట్‌లో ప్రశ్నించాడు.
రాత్రి 7 గంటల ప్రాంతంలో అదే ప్రాంతంలో పేలుడు పదార్థాలతో నింపిన హ్యుందాయ్ ఐ20 కారు పేలిపోయిన తర్వాత, ఈ పోస్ట్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఘటన జరగబోయే ప్రదేశం, సమయం విషయంలో ఇంత కచ్చితంగా అనుమానం వ్యక్తం చేయడంపై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. "అతను మనల్ని తెలియకుండానే హెచ్చరించడానికి ప్రయత్నించాడు", "అతను కచ్చితమైన ఆలోచనతో భవిష్యత్తును అంచనా వేశాడు" అంటూ కామెంట్లు పెడుతున్నారు.
సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద జరిగిన ఈ పేలుడు ఘటనపై ఉగ్రవాద కోణంలో విచారణ జరుగుతోంది. అదే రోజు ఫరీదాబాద్‌లో ఉగ్రవాద ముఠాకు చెందిన పలువురు అనుమానితులను అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఈ కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు.కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ ఘటనపై స్పందిస్తూ, అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు జరుపుతామని తెలిపారు. ఎన్ఐఏ, ఇంటెలిజెన్స్ బ్యూరో, ఢిల్లీ పోలీసుల యాంటీ-టెర్రర్ విభాగం సంయుక్తంగా ఈ కేసును విచారిస్తున్నాయని ఆయన ధృవీకరించారు.

# యువత భవిష్యత్ కోసమే కూటమి కృషి

### సంస్థల ఏర్పాటుతో యువతకు ఉద్యోగావకాశాలు

### గూగుల్ రాకతో మారనున్న ఎపి ముఖచిత్రం: కేశవ్



**అనంతపురం,నవంబర్ 11 ఆంధ్ర ప్రగతి** యువత భవిత కోసమే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సెరికల్చర్ కార్యాలయ ప్రాంగణంలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం పయ్యావుల మాట్లాడుతూ.. ఈనెల 13, 14, 15 తేదీల్లో విశాఖలో జరిగే వ్యాపార భాగస్వామ్య సదస్సుకు 51 దేశాల నుంచి వస్తున్నారని.. ఒప్పందాలు జరుగుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన దుర్మార్గాలను అధిగమించి చంద్రబాబు నాయుడు బ్రాండ్ చూసి లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయన్నారు. గూగుల్ సంస్థ అమెరికా తర్వాత ఏపీలో అతిపెద్ద పెట్టుబడి పెట్టిందని చెప్పుకొచ్చారు. కేవలం చంద్రబాబు బ్రాండ్‌తోనే ఇక్కడికి వచ్చినట్లు మంత్రి తెలిపారు.గతంలో మైక్రోసాఫ్ట్ తెస్తే యువతకు ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగాలు వచ్చాయని గుర్తుచేశారు. తాజాగా ఏఐ వచ్చాక గూగుల్ డేటా సెంటర్ వస్తోందన్నారు. గూగుల్‌తో పాటు ఏఐని వాడుకునే ఇతర పరిశ్రమలు పెద్ద ఎత్తున వస్తున్నాయని అన్నారు. ఇది మూడుతరాల వారిని అదుకుంటుందని తెలిపారు. జగన్ చెప్పినట్లు నాలుగు రేకులు వేసే షెడ్ కాదని వ్యాఖ్యలు చేశారు. విశాఖ ప్రపంచంలోనే పెద్ద డేటా సెంటర్ కాబోతోందన్నారు. భవిష్యత్‌తరాలు ఎలా బాగుపడతాయని జగన్ ఆలోచిస్తే బాగుంటుందని హితవు పలికారు. హంద్రీనీవాలో అన్ని పంపులు పని చేసే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. వీలైనన్ని ఎక్కువ నీరు వచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. రైతులు బాగుంటే.. పరిశ్రమలు వస్తే... రాష్ట్ర ఎకానమీ బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అప్పుల్లో ఉన్న రాష్టాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళు న్నామన్నారు. రేపు విశాఖలో అద్భుతాలు జరగబోతున్నాయన్నారు. గతంలో కార్పోరేట్ సంస్థలు ఇక్కడికి వచ్చేందుకు భయపడ్డాయన్నారు. కానీ నేడు పెట్టుబడులు పెట్టండి... ఉద్యోగాలు ఇవ్వండని సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ అడుగుతున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.
-----

# ఆజాద్‌కు నివాళి అర్పించిన చంద్రబాబు



**అమరావతి,నవంబర్ 11 ఆంధ్ర ప్రగతి**
స్వాతంత్ర్య సమరయోధులు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ క్రమంలోనే మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కి నివాళి అర్పించారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ ట్వీట్ పెట్టారు. సంస్కరణలతో దేశ విద్యా వ్యవస్థకు పునాది వేసిన స్వాతంత్ర్య సమరయోధుడు, భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళి అర్పిస్తున్నానని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విద్య, శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన కృషిని స్మరించుకుంటూ జాతీయ విద్యా దినోత్సవ, మైనార్టీ సంక్షేమ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు సీఎం చంద్రబాబు.

# అమరావతిలో ఎం.ఎస్.కె ప్రసాద్ అంతర్జాతీయ క్రికెట్ అకాడమీ.. ఘనంగా భూమి పూజ



**అమరావతి,నవంబర్ 11 ఆంధ్ర ప్రగతి**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కీలక అడుగు పడింది. భారత క్రికెట్ జట్టు మాజీ చీఫ్ సెలెక్టర్ ఎం.ఎస్.కె ప్రసాద్ ఆధ్వర్యంలో "ఎం.ఎస్.కె ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ" ఏర్పాటు కానుంది. ఈ అకాడమీ నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం.ఎస్.కె ప్రసాద్, ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. మెరికల్లాంటి యువ క్రీడాకారులను దేశానికి అందించడమే లక్ష్యంగా ఈ అకాడమీని స్థాపిస్తున్నట్లు ఆయన తెలిపారు.
సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్రికెట్ అకాడమీని నిర్మించనున్నారు. ఇది కేవలం శిక్షణా కేంద్రంగానే కాకుండా, ప్రపంచ స్థాయి క్రీడా సముదాయంగా అభివృద్ధి చెందుతుందని ఎం.ఎస్.కె వివరించారు. ఈ అకాడమీ ద్వారా స్థానిక క్రికెటర్లలోని ప్రతిభను పెంపొందించి, వారికి మెరుగైన అవకాశాలు కల్పిస్తామని ఆయన అన్నారు. అమరావతిలో క్రీడా మౌలిక వసతులను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
ఈ సమీకృత క్యాంపస్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రికెట్ మైదానం, పలు ప్రాక్టీస్ గ్రౌండ్లు, అత్యాధునిక శిక్షణా సదుపాయాలు ఏర్పాటు చేయనున్నారు. ఆధునిక నెట్లతో పాటు క్రీడాకారుల సామర్థ్యాన్ని విశ్లేషించే సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఇండోర్ ట్రైనింగ్ అకాడమీ దీని ప్రత్యేకత. క్రీడలతో పాటు విద్యకు ప్రాధాన్యతనిస్తూ అంతర్జాతీయ రెసిడెన్షియల్ పాఠశాలను కూడా ఇక్కడే నిర్మించనున్నారు. క్రీడాకారులు, సందర్శక జట్ల కోసం ప్రత్యేక వసతి, హాస్టల్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. స్థానిక టోర్నమెంట్ల నిర్వహణ కోసం మినీ క్రికెట్ స్టేడియం, అత్యాధునిక జిమ్, ఫిజియోథెరపీ, పునరావాస కేంద్రాలు కూడా ఈ ప్రాజెక్టులో భాగంగా ఉంటాయి. అమరావతిని ఒక క్రీడా కేంద్రంగా మార్చే లక్ష్యంతో సీఆర్డీఏ ఈ అకాడమీ నిర్మాణానికి పూర్తి సహాయ సహకారాలను అందిస్తోంది.

# డాక్టర్ ఉమర్ సూత్రధారిగా గుర్తింపు

### పేలుడులో అమోనియం నైట్రేట్ వాడినట్లు అనుమానం

### ఎలా పేల్చాడన్న దానిపై ఆరా తీస్తున్న భద్రతా బలగాలు



**న్యూఢిల్లీ,నవంబర్ 11 ఆంధ్ర ప్రగతి**
ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు ఘటనకు చెందిన దర్యాప్తు కొనసాగుతున్నది. సూసైడ్ బాంబర్ డాక్టర్ ఉమర్ ఎలా ఆ కారును పేల్చి ఉంటాడని ఆరా తీస్తున్నారు. అయితే అమోనియం నైట్రేట్ ఫ్యూయల్ ఆయిల్‌ను వాడడం వల్లే భారీ స్థాయిలో పేలుడు జరిగినట్లు అంచనా వేస్తున్నారు. హై ఇంటెన్సిటీ బ్లాస్ట్‌కు ఏఎన్ఎఫ్‌వోనే కారణం కావొచ్చు అని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే పేలుడు ఘటన జరిగిన సమీపంలో అమోనియం నైట్రేట్ ఆనవాళ్లను ఫోరెన్సిక్ అధికారులు గుర్తించారు. ఫిదాయిన్ తరహాలో ఆత్మహుతి దాడికి పాల్పడ్డాడు. ఫరీదాబాద్ టెర్రర్ మాడ్యూల్‌లో డాక్టర్ ఉమర్ పాత్ర ఉన్నట్లు అనుమానిస్తున్నారు. ఆ సిటీలోని పలు ప్రదేశాల నుంచి సుమారు 2900 కేజీల ఆర్డీఎక్స్‌ను సోమవారం రికవరీ చేసిన విషయం తెలిసిందే. అయితే ఎర్రకోట్ సమీపంలో కారు పేలిన సమయంలో.. దాంట్లో ఉమర్ ఒక్కడే ఉన్నట్లు క్లారిటీ ఇచ్చారు. అమోనియం నైట్రేట్ చాలా శక్తివంతమైన పేలుడు పదార్థాం. దీన్ని సాధారణంగా పరిశ్రమ పేలుళ్లకు వినియోగిస్తుంటారు. గతంలో ఉగ్రవాదులు పలుమార్లు ఈ రసాయనాన్ని వాడారు. ఐఈడీల్లో దీన్ని వినియోగించినట్లు తెలుస్తున్నది. శక్తివంతమైన పేలుడు ధాటికి పలు మీటర్ల దూరంలో ఉన్న వాహనాల అద్దాలు కూడా పగిలిపోయాయి. చాలా దూరంలో ఉన్న బిల్డింగ్‌ల్లోనూ ఆ శబ్దం వినిపించింది. టెర్రర్ మాడ్యూల్‌తో లింకున్న ఇద్దరు డాక్టర్లను పట్టుకోవడంతో.. భయాందోళనకు గురైన డాక్టర్ ఉమర్ ఈ పేలుడుకు పాల్పడి ఉంటాడని అంచనా వేస్తున్నారు.


# కృష్ణా జిల్లాలో ఘోర ప్రమాదం..

### ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకుల మృతి



**మచిలీపట్నంనవంబర్ 11 ఆంధ్ర ప్రగతి**
ఉయ్యూరు-మచిలీపట్నం జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. మరో యువకుడు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనతో మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.
వివరాల్లోకి వెళితే.. గండిగుంట సమీపంలో వేగంగా వెళుతున్న ఓ కారు అదుపుతప్పి రహదారి పక్కన బోల్తా పడింది. ప్రమాద తీవ్రతకు కారు నుజ్జునుజ్జయ్యింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.మృతులను కుందేరు గ్రామానికి చెందిన చింతయ్య (17), రాకేశ్ బాబు (24), ప్రిన్స్ (24)గా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని తక్షణమే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. అతివేగం కారణంగానే డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. స్థానికులు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నారు.ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందడంతో కుందేరులో విషాదఛాయలు అలముకున్నాయి.

# ప్రజలు అప్రమత్తం కావాలి.



**నవంబర్ 11 ఆంధ్ర ప్రగతి**
ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటన ద్వారా ఇస్లామిక్ టెర్రరిస్ట్ ముష్కరులు మరోమారు భారత్‌కు సవాల్ విసిరారు. మన పక్కనే ఉంటూ, మనతోనే తిరుగుతున్న ముష్కరులు మనలను మట్టుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని దేశ ప్రజలు గుర్తించాలి. ఇది ఏ ఢిల్లీలోనో లేదా గతంలో ముంబైలోనే జరిగిందని, మనకు సంబంధం లేదని మిన్నకుంటే పొరపాటు. ఉగ్రవాదులను గుర్తించి, వారి నుంచి భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్న గంటల్లోనే ఎర్రకోట వద్ద మారణహోమం సృష్టించారు. ఈ ఘటన జాతి యావత్తునూ ఉలిక్కిపడేలా చేసింది. పుల్వామా దాడి తరవాత పాక్‌పై ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పటి నుంచి ఇలాంటిది ఏదో ఉగ్రదాడి తప్పదన్న సంకేతాలు వస్తూనే ఉన్నాయి. ఈ దేశంలో కొందరు ఉగ్రవాదులకు ఆశ్రయమివ్వడం, కొందరు ఉగ్రవాదుల తో లింకు పెట్టుకుని ఉగ్రదాడులకు పాల్పడు తున్నారు. ఉగ్రవాదుల నుంచి రాబట్టిన సమాచారం మేరకు హైదరాబాద్‌లో అరెస్ట్ చేసిన ఓ ముష్కరుడి గురించి ప్రజలు తెలుసుకోవాలి. సామూహికంగా ప్రజలను అంతం చేసే ప్రణాళిక ఉన్నట్లు వెల్లడించారు. అందులో మంచినీళ్లలో లేదా ప్రసాదాల్లో విషం కలిపి చంపే అతిపెద్ద కుట్ర దాగివుంది. అందువల్ల ప్రతి ఒక్కరూ పక్కవాడిని గమనిస్తూ ఉండండింది. ముఖ్యంగా ఎక్కడ ఇస్లామిక్ తీవ్రవాదులు ఉన్నారో అన్న విషయంలో ఏమరుపాటుతో ఉండాలి. గ్రామస్థాయి నుంచే ప్రజలు అప్రమత్తం కావాలి. ఎవరు ఎక్కడికి వెళుతున్నారు..ఏం చేస్తున్నారో కన్నేయాలి. ప్రజలే నిఘా పెట్టాలి. ఇది కేవలం పోలీసుల పని అని సరిపెట్టుకుండా మనమంతా నిత్యజాగరూకతతో ఉండాలి. ఈ క్రమంలో ప్రజలు ఇకనుంచి నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిందే. ఇస్లామిక్ టెర్రరిస్టులు ఎప్పుడు ఎలా ఉంటారో..ఎక్కడి నుంచి వస్తారో తెలియదు. ఎందుకంటే డాక్టర్లంటే ప్రాణాలు కాపాడాల్సిన వృత్తిలో ఉన్నవారు. వారే మతం ముసుగులో మారణకాండకు పాల్పడ్డారు. వైద్యవృత్తి స్వీకరించి ప్రాణాలు కాపాడుతామని ప్రమాణం చేసిన వారు మతం ముందు ఇదంతా ఒట్టిదే అని రుజువు చేశారు. తమకు ప్రాణ్యాలు తీయడం ఓ లెక్క కాదని రుజువు చేశారు. ఇలా ఇప్పుడు ఎక్కడెక్కడ ఎవరెవరు ఉన్నారన్నది నిఘా సంస్థల వేటలో తెలియనుంది. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇప్పటికే ప్రకటించారు. ఇది పాక్ ప్రేరేపిత, ఇస్లామిక్ టెర్రరిజం అని గుర్తించాలి. ఈ దేశం గడ్డపై మారణహోమం సృష్టిస్తున్న కొందరు దేశం ఏమయిన ఆఫర్వాలేదు..తన పక్కవాడు చనిపోయినా ఫర్వాలేదన్న మతం ముసుగులో పని చేస్తున్నాడు. ఢిల్లీ ఎర్రకోట ఘటన సాయంత్రం దాదాపు 7 గంటల ప్రాంతంలో సుభాష్ మార్గ్ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఓ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఇప్పటి వరకు 12 మంది ప్రాణాలు కోల్పోయారు. 20 మందికిపైగా గాయపడ్డారు. పలు వాహనాలు దెబ్బతిన్నాయి. సమాచారం అందిన 10 నిమిషాల్లోనే ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్, స్పెషల్ బ్రాంచ్ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఎన్ఎస్‌జీ, ఎన్ఐఏ, ఫోరెన్సిక్ బృందాలు సమగ్ర దర్యాప్తు ప్రారంభించాయి. సమీపంలోని అన్ని సీసీటీవీ కెమెరాలను పరిశీలించారు. అన్ని ఆధారాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు నిర్వహిస్తున్నారు. వాస్తవాల ను ప్రజల ముందు ఉంచుతాం అని కేంద్రహోంమంత్రి అమిత్ షా తెలిపారు. చంపేవారికి మతం తప్ప మరోటి లేదు. వారు మతం పేరుతో భారతదేశాన్ని భస్మీపటలం చేయడం లేదా...ఇక్కడున్న వారిని అంతం చేయడానికి వెనకాడరని ఇప్పటి వరకు జరిగిన వందల పేలుళ్లు రుజువు చేశాయి. మొన్నటిమొన్న పహల్గామ్‌లో మతం పేరుతో హత్యాకాండకు తెగించారు. ఇప్పుడు ఢిల్లీలో బాంబ్ పేల్చారు. సామూహిక మారణ కాండకు తెగించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలు ఆహారం కొనడం మొదలు, మంచినీళ్లు తెచ్చుకుని తాగే వరకు అంతటా అనుమానంగానే చూడాలి. అనుమానంతోనే అడుగు బయటకు పెట్టాలి. ఏమూలన ఉగ్రమూకలు ఎలాంటి దురాగతాలకు పాల్పడుతారో కన్నేసి ఉంచాలి. ఇకపోతే దిల్లీలోని ఎర్రకోట సమీపంలో కారు పేలుడుతో ఘటనాస్థలంలో భీతావహ పరిస్థితులు నెలకొన్నాయి. పేలుడు ధాటికి పలువురి శరీర భాగాలు ఛిద్రమై..రోడ్డు, వాహనాలపై చెల్లాచెదురుగా పడినట్లు ప్రత్యక్ష సాక్షులు వెల్లడిం చారు. పెద్దఎత్తున మంటలు చెలరేగినట్లు చెప్పారు. అనేక వాహనాలు ధ్వంసమయ్యాయి. సమీపంలో ఉన్న మెట్రో స్టేషన్‌లోని దుకాణాల అద్దాలూ కూడా పగిలిపోయాయంటే ఎంతటి పేలుడు పదార్థాలు వాడోరో అర్థం చేసుకోవాలి. ఆ సమయంలో అందరూ ప్రాణభయంతో హాహాకారాలు చేస్తూ పరుగులు పెట్టారు.భవనాలు కంపించేంత స్థాయిలో పేలుడు తీవ్రత ఉందని ఓ దుకాణదారు తెలిపాడు. తాను నిలబడిన దుకాణం వణికిపోయింది. కిలోమీటరు దూరం నుంచే పేలుడు తీవ్రత గుర్తించారు. ఈ క్రమంలో పాఠశాలలు, రైల్వే స్టేషన్లు, మార్కెట్లు, ప్రార్థనా మందిరాలు ఇలా...ప్రతీచోటా అనుమానంగా ఉండాల్సిందే. అప్రమత్తంగా ఉండాల్సిందే. రైల్వే స్టేషన్లు, బస్ టెర్మినల్స్‌తో పాటు, ఢిల్లీ మెట్రో స్టేషన్లలో భద్రతా సంస్థలు నిఘా వేశాయి. పుకార్లను నమ్మకూడదని.. ఏదైనా అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపించినా వెంటనే సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. పోలీసులకు అనుమానలపై సమాచారం చేరవేస్తూనే ఉండాలి. ప్రజలే విజిలెన్స్ పాత్రను పోషించాలి. అప్పుడే మనచుట్టూ ఉన్న ముష్కరులు ఎవరో గుర్తు పట్టగలం. వారి నుంచి మనలను మనం, చివరకు దేశాన్ని రక్షించుకోలగం. భారతీయులంతా అప్రమత్తంగా లేకుంటే భారీ ప్రాణ నష్టాలను చవిచూస్తామని గుర్తించి ముందుకు సాగాలి.

# ముంబై ఇండియన్స్‌తో రవీంద్ర జడేజా సీక్రెట్ డీల్..!



ఐపీఎల్‌లో సంజూ శాంసన్, రవీంద్ర జడేజా ప్రస్తుతం మారుమోగిపోతున్నాయి. ట్రేడింగ్‌కు బంధించి చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య చర్చలు జరుగుతుండడంతో ఎవరు ఏ టీమ్‌లోకి వెళతారని అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. మొదట రవీంద్ర జడేజా కోసం మొదట సీఎస్‌కేను రాజస్థాన్ సంప్రదించగా.. కానీ చర్చలు ఫలించలేదు. అదే సమయంలో సంజూ శాంసన్ కోసం ఢిల్లీ కూడా ప్రయత్నించగా.. ఇవి కూడా విఫలమయ్యాయి. మొత్తానికి ఫైనల్‌గా సంజూ శాంసన్‌ను తీసుకునేందుకు చెన్నై ఆసక్తిగా ఎదురుచూస్తుండగా.. సీఎస్‌కే నుంచి రవీంద్ర జడేజాతోపాటు సామ్ కర్రాన్ లేదా మతిషా పతిరానాను తమకు ఇవ్వాలని రాజస్థాన్ కోరుతోంది. ఈ వారంలో అధికారిక ప్రకటన వచ్చే అవకాశం కనిపిస్తోంది. రవీంద్ర జడేజా ఐపీఎల్‌లో మొదట రాజస్థాన్ రాయల్స్‌తోనే ఎంట్రీ ఇచ్చాడు. 2008 మొదట సీజన్‌లో షేన్ వార్న్ నాయకత్వంలో రాజస్థాన్ ఛాంపియన్‌గా నిలిచిన టీమ్‌లో రవీంద్ర జడేజా సభ్యుడిగా ఉన్నాడు. ఆ తరువాత సీజన్‌లోనూ రాజస్థాన్‌కు ఆడిన జడేజా.. ఆ తరువాత చేసిన ఓ తప్పుతో ఒక సీజన్ నిషేధానికి గురయ్యాడు. 2010లో జడేజా తన ఫ్రాంచైజీ రాజస్థాన్‌కు తెలియజేయకుండా ముంబై ఇండియన్స్‌కు మారడానికి ప్రయత్నించాడు. ముంబై ఫ్రాంచైజీతో చర్చలు జరపడంతో %ఖూా% గవర్నింగ్ కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో ఒక సీజన్ మొత్తానికి జడేజాపై వేటు వేసింది. ఆ సమయంలో ఐపీఎల్ ఛైర్మన్‌గా ఉన్న లలిత్ మోడీ మాట్లాడుతూ.. %ఖూా% గవర్నింగ్ కౌన్సిల్ ఏర్పాటు చేసిన ఆటగాళ్ల మార్గదర్శకాలు చాలా ముఖ్యమైనవి అని.. ప్రతి ఆటగాడు తప్పకుండా పాటించాలని అన్నారు. జడేజా తన ఫ్రాంచైజీకి తెలియకుండా మరో టీమ్‌తో చర్చలు జరపడం నిబంధనలకు విరుద్ధమని.. అందుకే ఏడాది నిషేధం విధిస్తున్నట్లు తెలిపారు. దీంతో రవీంద్ర జడేజాను 2010లో రాజస్థాన్ రాయల్స్ టీమ్ నుంచి విడుదల చేసింది. ఆ తరువాత సీజన్‌లో రీఎంట్రీ ఇచ్చిన జడేజా.. కొచ్చి టస్కర్స్ కేరళ తరఫున ఆడాడు. ఆ సీజన్‌లో 14 మ్యాచ్‌ల్లో 283 పరుగులు, ఎనిమిది వికెట్లతో మంచి ప్రదర్శన చేశాడు. 2012 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ టీమ్‌లో చేరాడు. ఆ వేలంలో అత్యంత ఖరీదైన ఆటగాళ్లలో జడేజా ఒకటిగా నిలిచాడు. అప్పటి నుంచి సీఎస్‌కే జడేజా ప్రయాణం కొనసాగుతోంది. 2016, 2017లో రెండు సీజన్లు చెన్నై టీమ్‌పై నిషేధం విధించినప్పుడు.. సురేష్ రైనా నాయకత్వంలో గుజరాత్ లయన్స్ టీమ్‌కు జడేజా ప్రాతినిధ్యం వహించాడు. ఆ తరువాత మళ్లీ సీఎస్‌కే టీమ్‌కు తరుపున ఆడాడు. చెన్నై ఐదు టైటిళ్లు గెలవగా.. మూడు టైటిళ్లను గెలవడంలో జడేజా కీలక పాత్ర పోషించాడు. 2023 ఫైనల్‌లో జడేజా ఇన్నింగ్స్ మరపురానిది. మోహిత్ శర్మ వేసిన చివరి ఓవర్‌లో జడేజా అద్భుతంగా ఆడి టీమ్‌ను ఛాంపియన్‌గా నిలిపాడు. 2022 సీజన్‌లో చెన్నైకు టీమ్‌కు కొన్ని మ్యాచ్‌లు కెప్టెన్‌గా వ్యవహరించినా.. సక్సెస్ కాలేకపోవడంతో ఆటగాడిగా కొనసాగుతున్నాడు.



# ఇంకా కోలుకుని శ్రేయాస్ అయ్యర్..

భారత వన్డే జట్టు వైస్ కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ స్వదేశానికి తిరిగి వచ్చాడు. గాయం నుంచి కోలుకోవడానికి ఇంకా సమయం పట్టేలా ఉంది. అయ్యర్ పరిస్థితి మొదట అనుకున్న దానికంటే చాలా తీవ్రంగా ఉంది. ఈ సంఘటన తర్వాత ఒక సమయంలో, అతని ఆక్సిజన్ లెవల్స్ 50 కి పడిపోయింది. "అతను దాదాపు 10 నిమిషాలు సరిగ్గా నిలబడలేకపోయాడు. అతని చుట్టూ పూర్తిగా బ్లాక్‌అవుట్ ఏర్పడింది. అతను సాధారణ స్థితికి రావడానికి కొంత సమయం పడుతుంది" అని భారత బోర్డుకు ఒకరు తెలిపారు. నవంబర్ 30 నుంచి దక్షిణాఫ్రికాతో జరగనున్న మూడు వన్డేల సిరీస్‌లో శ్రేయాస్ అయ్యర్ పాల్గొనడంపై ఇంకా సందేహాలు ఉన్నాయి. నవంబర్ 14 నుంచి ప్రారంభమయ్యే రెండు టెస్ట్ మ్యాచ్‌ల తర్వాత, భారత్ రాంచీ, రాయ్‌పూర్, విశాఖపట్నంలో మూడు వన్డేలు ఆడనుంది. ఇటీవలే ఆస్ట్రేలియా నుండి స్వదేశానికి తిరిగి వచ్చిన అయ్యర్ తనకు తగిలిన గాయం నుండి ఇంకా కోలుకోలేదని తెలుస్తోంది. అంతర్జాతీయ క్రికెట్ ఆడటానికి ఫిట్‌గా ఉండటానికి మరింత సమయం అవసరమని వైద్యులు సూచించినట్లు సమాచారం. అయ్యర్ ఆరోగ్య స్థితి గురించి సెలక్షన్ కమిటీకి సమాచారం అందింది. వైద్య నివేదికల ప్రకారం అతను ఫిట్‌గా ఉండటానికి దాదాపు ఒక నెల కన్నా ఎక్కువ సమయం పడుతుందని పేర్కొన్నారు. "అతను పూర్తిగా ఫిట్‌గా ఉండటానికి ఎక్కువ సమయం పడుతుంది. అతని గాయం తర్వాత బోర్డు, సెలక్షన్ కమిటీ తొందరపడటంలేదు. దక్షిణాఫ్రికా వన్డే సిరీస్‌లో అతను ఆడటం సందేహమే" అని భారత బోర్డులోని ఒక వర్గాలు ధృవీకరించాయి. అతను సాధారణ స్థితికి రావడానికి కొంత సమయం పడుతుందని భావిస్తున్నారు. గత వారం సిడ్నీ క్రికెట్ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియా, భారత్ మధ్య జరిగిన 3వ వన్డే సందర్భంగా గాయపడిన అయ్యర్‌ను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. అలెక్స్ కారీని అవుట్ చేయడానికి డైవింగ్ క్యాచ్ తీసుకుంటూ అయ్యర్ నేలపై పడి గాయపడ్డాడు. పొత్తికడుపులో ప్లీహానికి గాయం కావడంతో అంతర్గత రక్తస్రావంతో ఆయనను సిడ్నీ ఆసుపత్రిలో చేర్చారు. అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్లి గత వారం డిశ్చార్జ్ చేశారు.

# డిసెంబర్ 17నుండి ఐపీఎల్ మినీవేలం



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న మినీ-వేలం తేదీ, వేదిక గురించి కీలక అప్‌డేట్ వెలువడింది. సాధారణంగా డిసెంబర్ నెలలో జరిగే ఈ వేలానికి సంబంధించి, అధికారికంగా తేదీలు ఖరారు కానప్పటికీ, కీలకమైన నివేదికలు వేలం ఎప్పుడు, ఎక్కడ జరగనుందో స్పష్టం చేస్తున్నాయి. ఐపీఎల్ మినీ-వేలం 2026 ను డిసెంబర్ 17 లేదా 18 తేదీల్లో నిర్వహించడానికి భారత క్రికెట్ నియంత్రణ మండలి సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాలు నివేదిస్తున్నాయి. మెగా-వేలం జరిగిన తర్వాత (2025 సీజన్‌కు మెగా-వేలం జరిగింది), ఆ తరువాతి సీజన్‌కు (2026) సాధారణంగా మినీ-వేలం నిర్వహిస్తారు. ఈ వేలంలో ఫ్రాంచైజీలు తమ పర్స్‌లో మిగిలిన డబ్బుతో పాటు, విడుదల చేసిన ఆటగాళ్ల ఖర్చును జోడించుకుని వేలంలో పాల్గొంటాయి. డిసెంబర్ మధ్యలో ఈ ఈవెంట్‌ను నిర్వహించడం అనేది ప్రతీ ఏటా జరిగే ప్రక్రియలో భాగమే. ఐపీఎల్ వేలం చరిత్రలో ఒక ముఖ్యమైన మార్పుగా, 2026 మినీ-వేలాన్ని దుబాయ్‌లో నిర్వహించడానికి బీసీసీఐ ప్లాన్ చేస్తోందని తెలుస్తోంది. గతంలో కూడా ఐపీఎల్ వేలాన్ని ఒకసారి విదేశంలో నిర్వహించారు. దుబాయ్ అంతర్జాతీయ పర్యాటక కేంద్రం కావడంతో, అన్ని ఫ్రాంచైజీల యజమానులు, ముఖ్యంగా విదేశీ యజమానులు, మేనేజ్‌మెంట్ బృందాలు సులభంగా వేలంలో పాల్గొనేందుకు ఇది అనుకూలమైన వేదిక. ఈ ఈవెంట్‌కు మరింత అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడానికి బీసీసీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. గతంలో ఐపీఎల్ వేలాన్ని బెంగళూరు, జైపూర్, కోల్‌కతా, మరియు కొచ్చి వంటి భారతీయ నగరాల్లో నిర్వహించారు. దుబాయ్‌లో వేలాన్ని నిర్వహించడం ఐపీఎల్ చరిత్రలో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలవనుంది. ఈ తేదీ, వేదికపై తుది నిర్ణయం బీసీసీఐ ద్వారా అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. అయితే, సాధారణంగా మీడియా నివేదికలు సరైనవే అవుతుంటాయి. నవంబర్ చివరి వారంలో లేదా డిసెంబర్ మొదటి వారంలో బీసీసీఐ ఈ వివరాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. జట్లు ఇప్పటికే తమ రిటెన్షన్ జాబితాలను సిద్ధం చేసి, ఏ ఆటగాళ్లను వేలంలోకి పంపించాలో నిర్ణయించుకుంటున్న తరుణంలో, ఈ అప్‌డేట్ ఐపీఎల్ అభిమానులకు ఉత్సాహాన్నిస్తోంది.

# టీమిండియా టీ20 ప్రపంచ కప్‌కు సిద్ధం

ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న టీ20 ప్రపంచ కప్‌నకు కౌంట్ డౌన్ ప్రారంభమైంది. ఫిబ్రవరి 7 నుంచి ప్రారంభం కానున్న ఈ పొట్టి ప్రపంచ కప్‌నకు భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇవ్వనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన టీం ఇండియా మరోసారి తన టైటిల్‌ను నిలబెట్టుకోవాలని భావిస్తోంది. దీని కోసం, రాబోయే 10 మ్యాచ్‌లకు పూర్తిగా సిద్ధమవుతోంది. అంటే, టీ20 ప్రపంచ కప్‌నకు ముందు భారత జట్టు స్వదేశంలో 10 టీ20 మ్యాచ్‌లు ఆడుతుంది. ఆ తర్వాత నేరుగా షార్ట్ వరల్డ్ కప్‌లో పాల్గొంటుంది. షార్ట్ వరల్డ్ కప్‌లో మొత్తం 20 జట్లు పోటీ పడనున్నాయి. ఇందులో భారత జట్టు లీగ్ దశలో 3 మ్యాచ్‌లు ఆడటం ఖాయం. అలాగే, భారత జట్టు తదుపరి దశకు చేరుకుంటే, మరో నాలుగు మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంది. రాబోయే టీ20 ప్రపంచ కప్ గ్రూప్ ఫార్మాట్‌లో జరగనున్నందున, మొదటి దశలో గ్రూప్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆ తర్వాత, సూపర్-10 మ్యాచ్‌లు జరుగుతాయి. ఈ మ్యాచ్‌లన్నింటికీ ముందు, టీమిండియా దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌తో తలపడుతుంది. అంటే, డిసెంబర్‌లో భారత జట్టు దక్షిణాఫ్రికాతో 5 టీ20 మ్యాచ్‌లు ఆడుతుంది. ఆ తర్వాత, జనవరిలో న్యూజిలాండ్ జట్టుతో భారత్ 5 మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనుంది. ఈ మ్యాచ్‌ల ద్వారా టీమిండియా టీ20 ప్రపంచ కప్‌కు సిద్ధమవుతుంది. దీని ప్రకారం, టీ20 ప్రపంచ కప్‌నకు ముందు భారత జట్టు ఆడనున్న టీ20 మ్యాచ్‌ల పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

# సౌతాఫ్రికాతో తొలి టెస్ట్‌కు భారత జట్టు ప్రకటన

- బౌలింగ్ కూర్పుపై మేనేజ్‌మెంట్ తర్జనభర్జన



భారత్ వర్సెస్ దక్షిణాఫ్రికా మధ్య రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ నవంబర్ 14న ప్రారంభం కానుంది. అయితే, ఈ సిరీస్‌కు ముందు, భారత జట్టు ప్లేయింగ్ ఎలెవన్ ఎంపిక విషయంలో క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. కోల్‌కతాలో జరిగిన మొదటి టెస్ట్‌కు కేవలం నాలుగు రోజుల ముందు, రిషబ్ పంత్ పునరాగమనం, ధ్రువ్ జురెల్ అద్భుతమైన ప్రదర్శన జట్టు కలయిక విషయంలో కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్‌లను సందిగ్ధంలో పడేశాయి. రిషబ్ పంత్ తిరిగి రావడం ఇప్పటికే ముందే నిర్ణయించిన విషయం. వైస్ కెప్టెన్‌గా, ప్లేయింగ్ ఎలెవెన్‌లో అతని స్థానం ఖచ్చితంగా ఉందని భావించారు. అయితే, సమస్య పంత్ కాదు, కానీ ధ్రువ్ జురెల్, అతను అరంగేట్రం చేసినప్పటి నుంచి దాదాపు ప్రతి సందర్భంలోనూ అద్భుతంగా ప్రదర్శన ఇచ్చాడు. అతని స్థిరమైన ప్రదర్శనలు, ఇండియా ఏ తరపున అతను చేసిన ఇటీవలి సెంచరీతో ఈ ప్లేయర్‌ను విస్మరించడం కష్టతరం చేశాయి. ఇంగ్లాండ్‌లో పంత్ గాయం తర్వాత, జురెల్ జట్టులో స్థానం సంపాదించాడు. అద్భుతంగా ప్రదర్శన ఇచ్చాడు. అందువల్ల, అతన్ని ఇప్పుడు తొలగిస్తే, అది అతనికి అన్యాయం అవుతుంది. ఎందుకంటే అతను అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. సాయి సుదర్శన్, నితీష్ కుమార్ రెడ్డి మధ్య కఠినమైన నిర్ణయం తీసుకోవడంలోనే పరిష్కారం ఉందని భారత మాజీ ఓపెనర్ ఆకాశ్ చోప్రా అభిప్రాయపడ్డారు. యువ బ్యాట్స్‌మన్‌ను త్యాగం చేయాల్సిన అవసరం ఉన్నా, జురెల్‌కు భారత జట్టులో చోటు కల్పించాలి అని చోప్రా తన యూట్యూబ్ ఛానెల్‌లో చెప్పుకొచ్చాడు. "ధృవ్ జురెల్, రిషబ్ పంత్ ఇద్దరూ జట్టులో ఉన్నారు. పంత్ వైస్ కెప్టెన్, అతను ఆడాలి. కానీ జురెల్ కూడా ఆడాలని నేను అనుకుంటున్నాను. ప్లేయింగ్ ఎలెవెన్‌లో అతనికి చోటు కల్పించాలి. "సాయి సుదర్శన్ నంబర్ 3 లో ఆడాలని నేను నమ్ముతున్నాను. మీరు ఇప్పటివరకు నితీష్ కుమార్ రెడ్డికి ముఖ్యమైన బౌలింగ్ పాత్ర ఇవ్వలేదు. కాబట్టి, మీరు అతన్ని వదిలివేసి ధ్రువ్ జురెల్‌కు అవకాశం ఇవ్వవచ్చు" అని ఆయన అన్నారు. చోప్రా అభిప్రాయం ఇటీవలి గణాంకాల ఆధారంగా ఉంది. ఈ సీజన్‌లో భారత జట్టు తరపున రెడ్-బాల్ క్రికెట్‌లో ధ్రువ్ జురెల్ బ్యాటింగ్ ప్రదర్శన ఆకట్టుకుంది. అక్టోబర్‌లో వెస్టిండీస్‌పై అతను 125 పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికా ఏపై అజేయంగా 132లి పరుగులు చేశాడు. అతని దేశీయ రికార్డు కూడా అద్భుతమైనది.మరోవైపు, నితీష్ కుమార్ రెడ్డి ఏ తప్పు చేయలేదు. కానీ, జట్టు యాజమాన్యం, కెప్టెన్ అతన్ని సరిగ్గా ఉపయోగించుకోలేదు. గత టెస్ట్ సిరీస్‌లో, 21 ఏళ్ల అతను రెండు మ్యాచ్‌ల్లో కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేశాడు. అది ప్రభావం చూపడానికి సరిపోలేదు. అతని బ్యాటింగ్ కూడా జురెల్‌ను తొలగించాల్సినంత ప్రదర్శనను అందించలేదు.తొలి టెస్టుకు భారత ప్రాబబుల్ ప్లేయింగ్ 11: శుభ్‌మన్ గిల్ (సి), ధృవ్ జురెల్, రవీంద్ర జడేజా, యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్, రిషబ్ పంత్ (డబ్ల్యుకె) (విసి), కుల్దీప్ యాదవ్, అక్షర్ పటేల్, జస్ప్రీత్ బుమ్రా, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్.

# డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలంటే ఈ సిరీస్ గెలవాలి

- టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సైకిల్‌లో ఫైనల్ చేరాలంటే సొంతగడ్డపై సౌతాఫ్రికాతో జరిగే రెండు టెస్ట్‌ల సిరీస్‌లో విజయం సాధించాలని టీమిండియా స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ అన్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ అయిన సౌతాఫ్రికాను ఓడిస్తే డబ్ల్యూటీసీ సైకిల్‌లో అగ్రస్థానంలో నిలువవచ్చని అభిప్రాయపడ్డాడు.ఈ సైకిల్‌ను టీమిండియా డ్రాతో ప్రారంభించింది. ఇంగ్లండ్ పర్యటనలో ఐదు టెస్ట్‌ల సిరీస్‌ను 2-2తో డ్రా చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరిగిన రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0తో గెలుచుకుంది. డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌లో టీమిండియా 61.5 విన్నింగ్ పర్సంటేజ్‌తో మూడో స్థానంలో కొనసాగుతుంది. ఆస్ట్రేలియా, శ్రీలంక టాప్-2లో కొనసాగుతున్నాయి. గత డబ్ల్యూటీసీ సైకిల్‌లో టీమిండియా తృటిలో ఫైనల్ బెర్త్‌ను కోల్పోయింది. అగ్రస్థానంలో నిలిచి ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా ఫైనల్ చేరాయి. సౌతాఫ్రికా విజేతగా నిలిచింది. సౌతాఫ్రికాతో నవంబర్ 14 నుంచి రెండు టెస్ట్‌ల సిరీస్‌లో ప్రారంభం కానుంది. కోల్‌కతా వేదికగా తొలి మ్యాచ్ జరగనుండగా.. ఇరు జట్లు ముమ్మరంగా సాధన చేస్తున్నాయి. ఈ సిరీస్‌కు ముందు పాకిస్థాన్‌లో పర్యటించిన సౌతాఫ్రికా రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసుకుంది. సౌతాఫ్రికాతో సిరీస్ నేపథ్యంలో అధికారిక బ్రాడ్‌కాస్టర్‌తో మాట్లాడిన సిరాజ్.. ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ఈ సిరీస్ ఈ నయా డబ్ల్యూటీసీ సైకిల్‌కు చాలా కీలకం. ప్రత్యేకించి సౌతాఫ్రికా డిఫెండింగ్ ఛాంపియన్ కాబట్టి ఆ జట్టును ఓడిస్తే ఫైనల్ చేరే అవకాశాలు మెరుగవుతాయి. ఆ జట్టు పాకిస్థాన్‌తో 1-1తో డ్రా చేసుకున్నప్పటికీ.. మా ఫామ్‌పై మాకు నమ్మకం ఉంది. మేం సానుకూల వాతవరణాన్ని సృష్టించాం. ఇంగ్లండ్ పర్యటనలో మెరుగైన ప్రదర్శన చేశాం. వెస్టిండీస్‌పై సిరీజ్ గెలిచాం. వ్యక్తిగతంగా నేను మంచి లయతో బౌలింగ్ చేస్తున్నాను. దానిని సద్వినియోగం చేసుకోవాలనుకుంటున్నాను. బలమైన జట్టుతో ఆడుతున్నప్పుడు మెరుగు పర్చుకోవాల్సిన అంశాలు ఏంటో తెలుస్తాయి. ఈ సిరీస్‌లో ఎదురయ్యే సవాళ్ల కోసం నేను ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాను.'అని సిరాజ్ చెప్పుకొచ్చాడు. ఈ సైకిల్‌లో మహమ్మద్ సిరాజ్ అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నాడు. ఈ సైకిల్‌లో సిరాజ్ 7 మ్యాచ్‌లు ఆడి 26.54 సగటుతో 33 వికెట్లు పడగొట్టాడు.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## నిర్మాత బెల్లంకొండ సురేశ్‌పై భూకబ్జా కేసు.. ఫిల్మ్‌నగర్‌లో కలకలం



ప్రముఖ టాలీవుడ్ నిర్మాత బెల్లంకొండ సురేశ్‌పై భూకబ్జా ఆరోపణలతో కేసు నమోదైంది. హైదరాబాద్‌లోని ఖరీదైన ఫిల్మ్‌నగర్ ప్రాంతంలో తన ఇంటిని సురేశ్, ఆయన అనుచరులు అక్రమంగా ఆక్రమించుకున్నారని ఆరోపిస్తూ శివ ప్రసాద్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.వివరాల్లోకి వెళితే.. ఫిల్మ్‌నగర్ రోడ్ నం.7లో ఉన్న తన ఇంటికి శివ ప్రసాద్ తాళం వేసి, కొంతకాలంగా బంధువుల వద్ద ఉంటున్నారు. ఇదే అదనుగా భావించిన బెల్లంకొండ సురేశ్, తన మనుషులతో కలిసి ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించారని ఆయన ఆరోపించారు. అంతేకాకుండా ఇంట్లోని ఫర్నిచర్‌తో పాటు ఇతర సామగ్రిని ధ్వంసం చేసి, గోడలను పాడుచేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.కొన్నాళ్ల తర్వాత ఇంటికి తిరిగి వచ్చిన శివ ప్రసాద్, లోపలి దృశ్యాలు చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ విషయంపై మాట్లాడేందుకు తన సిబ్బందిని బెల్లంకొండ సురేశ్ ఇంటికి పంపగా, అక్కడ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుందని, వారిపై దాడికి కూడా ప్రయత్నించారని ఆయన వివరించారు.శివ ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఫిల్మ్‌నగర్ పోలీసులు.. బెల్లంకొండ సురేశ్‌పై బీఎన్ఎస్ 329(4), 324(5), 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే, ఈ తీవ్ర ఆరోపణలపై బెల్లంకొండ సురేశ్ వైపు నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# ‘రాబందు’ సినిమా ట్రైలర్ విడుదల చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

ప్రీతి నిగమ్, రామ్, భాను ప్రసాద్, సురేశ్ రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కొత్త చిత్రం ‘రాబందు’. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ట్రైలర్‌ను తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి విడుదల చేశారు. పులిజాల ఫిల్మ్స్ పతాకంపై పులిజాల సురేశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమా విడుదలకు సిద్ధమైన నేపథ్యంలో చిత్ర యూనిట్ ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది.

ఈ కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి ట్రైలర్‌ను ఆవిష్కరించి చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రముఖ దర్శకుడు సముద్ర ఒక లిరికల్ సాంగ్‌ను విడుదల చేయగా, నటి ప్రీతి నిగమ్ టీజర్‌ను లాంచ్ చేశారు. ఈ వేడుకలో సెన్సార్ బోర్డు సభ్యులు ఉపేంద్ర, రేణు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా దర్శకుడు జయశేఖర్ కల్లు మాట్లాడుతూ.. “సమాజంలో జరుగుతున్న కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా భారీ యాక్షన్ నేపథ్యంలో ‘రాబందు’ చిత్రాన్ని నిర్మించాం. మా సినిమా ట్రైలర్‌ను మంత్రి కోమటిరెడ్డి గారు విడుదల చేయడం చాలా సంతోషంగా ఉంది. నిర్మాత సురేశ్ గారు నాపై నమ్మకంతో ఈ అవకాశం ఇచ్చారు. సినిమా అద్భుతంగా వచ్చింది. నటీనటులు, సాంకేతిక నిపుణుల సహకారంతోనే ఇది సాధ్యమైంది. త్వరలో విడుదల కానున్న మా చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని కోరుతున్నాను” అని తెలిపారు.అనంతరం దర్శకుడు సముద్ర మాట్లాడుతూ.. “దర్శకుడు జయశేఖర్ నాకు మంచి స్నేహితుడు. ఇది ఆయనకు నాలుగో సినిమా. ‘యానిమల్’ సినిమా లాగే



‘రాబందు’ అనే టైటిల్ చాలా మాస్‌గా, వైలెంట్‌గా ఉంది. టైటిల్‌కు తగ్గట్టే సినిమా కూడా ఉంటుందని ఆశిస్తున్నా. ఈ చిత్రం నటీనటులతో పాటు నిర్మాత, దర్శకుడికి మంచి విజయాన్ని అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను” అన్నారు. ఆయన వ్యాఖ్యలతో సినిమాపై ఆసక్తి పెరిగింది.



# ఇకపై అలాంటి పాత్రలు చేయను

## : మీనాక్షి చౌదరి

టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకెళుతున్న యువ హీరోయిన్ మీనాక్షి చౌదరి తన కెరీర్ విషయంలో ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. భవిష్యత్తులో పిల్లల తల్లిగా కనిపించే పాత్రలు చేయబోనని ఆమె తేల్చి చెప్పారు. ‘హిట్ 2’ చిత్రంతో భారీ విజయాన్ని అందుకుని, ఆపై ‘గుంటూరు కారం’లో మహేశ్ బాబు సరసన మెరిసిన ఈ బ్యూటీ, ప్రస్తుతం ఇండస్ట్రీలో బిజీగా రాణిస్తున్నారు.

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన మీనాక్షి, తన సినీ ప్రయాణం గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. “దుల్కర్ సల్మాన్‌తో కలిసి నటించిన ‘లక్కీ భాస్కర్’ సినిమాలో కథ నచ్చడం వల్లే తల్లి పాత్రలో కనిపించాను. అయితే భవిష్యత్తులో అలాంటి పాత్రలు వస్తే మొహమాటం లేకుండా ‘నో’ చెబుతాను. నటిగా ఎలాంటి పాత్ర అయినా చేయాలి, కానీ కొన్ని పరిమితులు పెట్టుకోవడం అవసరం” అని ఆమె స్పష్టం చేశారు. సీనియర్ హీరోలతో కలిసి నటించడం తనకు ఇబ్బంది కాదని, దానిని ఒక కొత్త జానర్‌గా భావిస్తానని ఆమె పేర్కొన్నారు.

‘ఇచ్చట వాహనములు నిలుపరాదు’ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన మీనాక్షి, ‘హిట్ 2’తో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ తర్వాత వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అగ్ర హీరోల సరసన నటిస్తున్నారు. ప్రస్తుతం ఆమె మెగాస్టార్ చిరంజీవితో కలిసి ‘విశ్వంభర’ చిత్రంలో నటిస్తున్నారు. “చిరంజీవి గారితో చేస్తున్న విశ్వంభర సినిమా నా కెరీర్‌లో ఒక స్పెషల్ చాప్టర్‌గా నిలిచిపోతుందనే నమ్మకం ఉంది” అని ఆమె ధీమా వ్యక్తం చేశారు. అలాగే, వెంకటేశ్‌తో కలిసి నటిస్తున్న ‘సంక్రాంతికి వస్తున్నాం’ సినిమా షూటింగ్‌ను కూడా ఎంతో ఆస్వాదించానని తెలిపారు.


తనపై వచ్చే రూమర్ల గురించి కూడా మీనాక్షి స్పందించారు. “నా గురించి ఏదైనా విషయం చెప్పాలంటే నేనే స్వయంగా చెబుతాను. నాకు సోషల్ మీడియా ఉంది. కాబట్టి అనవసరమైన వదంతులను ఎవరూ సృష్టించాల్సిన పనిలేదు” అంటూ పుకార్లకు ఘాటుగా సమాధానమిచ్చారు.

# చై-అఖిల్‌కి ఆ ధైర్యం లేదు: నాగ్



ఆర్జీవీ తెరకెక్కించిన కల్ట్ క్లాసిక్ %-%శివ%-% దాదాపు 36 ఏళ్ల తర్వాత థియేటర్లలో రీరిలీజవుతున్న సంగతి తెలిసిందే. 4కేలో రీమాస్టర్ చేసిన వెర్షన్ ను డాల్బీ సౌండ్ తో సినిమా నవంబర్ 14న విడుదలకు సిద్ధంగా ఉంది. తాజాగా ప్రీమియర్ వీక్షించిన తరవాత దీనికి అద్భుత స్పందనలు వస్తున్నాయని చిత్రబృందం వెల్లడించింది. ప్రత్యేక ప్రీమియర్ వీక్షించిన నాగార్జునకు మూడు ఆసక్తికర ప్రశ్నలు ఎదురయ్యాయి. వీటిలో నాగచైతన్య, అఖిల్ ఈ సినిమాను ఎప్పుడైనా రీమేక్ చేయాలని అనుకున్నారా? అని ప్రశ్నించగానే, అందుకు వారికి ధైర్యం లేదని నాగార్జున నవ్వేసారు. ఈ సినిమాను తనకు ఇచ్చిన ఆర్జీవీకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇది లైఫ్ లో ఒకసారి మాత్రమే ఎదురయ్యే అనుభవం. నాన్న (ఏఎన్నార్) గారు ఈ సినిమా చూసిన రెండు రోజుల తర్వాత నన్ను డ్రైవ్ కి తీసుకెళ్లి సినిమా పెద్ద హిట్! అని అన్నారు... అని తెలిపారు. సినిమా చూసాక రకరకాల కామెంట్లు విన్నానని నాగ్ నాటి విషయాలను గుర్తు చేసుకున్నారు. రీమాస్టర్ వెర్షన్ చూసాక మళ్లీ కొత్త సినిమా చూస్తున్నానా? అన్న ఫీలింగ్ కలిగిందని నాగ్ అన్నారు. ఇదే వేదికపై చిత్ర దర్శకుడు ఆర్జీవీకి కొన్ని ఆసక్తికర ప్రశ్నలు ఎదురయ్యాయి. మరోసారి నాగార్జునతో కలిసి పనిచేస్తారా? అని ప్రశ్నించగా.. నేను మరొక సినిమా కోసం నాగార్జునను సంప్రదించాలంటే, హిట్ ఇచ్చిన తర్వాతే అలా చేస్తానని అన్నారు. 90లలో శివ ట్రెండ్ సెట్టర్ మూవీగా నిలవడంలో ఆర్జీవీ దర్శకత్వ ప్రతిభతో పాటు, నాగార్జున, రఘువరణ్ ల నటన, ఇళయరాజా మ్యూజిక్ కలిసొచ్చాయి. తన తొలి సినిమాతోనే ఆర్జీవీ మ్యాజిక్ మొదలైంది. ఈ సినిమాలో సైకిల్ చైన్ సీన్ ని నాగార్జునతో ఎలా చేయించానో ... దానిని ఎలా అంగీకరించాడో ఆశ్చర్యంగా ఉందని ఆర్జీవీ అన్నాడు. శివ చిత్రం నాగార్జునకు అంకితం అని అన్నారు. నేను రాత్రి అనే చిన్న సినిమా చేయాలనుకున్నప్పుడు నాగార్జున కోసం కథ రాయమన్నారు నిర్మాత వెంకట్. అప్పటికి నేను బ్రూస్ లీ %-%రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్%-% చిత్రాన్ని 50వ సారి చూసాను. ఆయనకు అంతటి అభిమానిని.. ఆ సినిమాలో రెస్టారెంట్ బ్యాక్ డ్రాప్ ని శివ కోసం కాలేజీ నేపథ్యంలో ఉపయోగించానని వర్మ తెలిపారు. నా కాలేజీ అనుభవాలన్నిటినీ కలిపి 20నిమిషాల్లోనే వన్ లైన్ తో రెడీ అయ్యానని తెలిపారు.

# చిరంజీవి సినిమాలో ఐటెం సాంగ్..?




మహిళల శరీరాకృతి ఎప్పుడూ ఒకేలా ఉండదని, ఐదేళ్లకు ఓసారి మార్పులు జరుగుతుంటాయని ప్రముఖ నటి తమన్నా భాటియా పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ఒకే శరీరాకృతితో కనిపించలేమని ఆమె వివరించారు. బరువు తగ్గేందుకు ఇంజెక్షన్లు వాడుతున్నారంటూ తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పదిహేనేళ్ల వయసు నుంచే తాను నటిస్తున్నానని తెలిపారు. అప్పుడు ఎలా ఉన్నానో ఇప్పటికీ అలాగే ఉన్నానని తాను భావిస్తున్నట్లు చెప్పారు. అయితే, సినిమాల్లోని పాత్రల కోసం ఒక్కోసారి బరువు పెరగడం, మరోసారి తగ్గడం చేయాల్సి వస్తుందని తమన్నా వివరించారు. చిన్న వయసులోనే సినిమాల్లోకి వచ్చానని, కెమెరాతో తన ప్రయాణం సాగుతోందని చెప్పారు. ఇందులో దాచిపెట్టడానికి ఏమీలేదన్నారు.

ఇటీవల కాలంలో తమన్నా స్పెషల్ సాంగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారారు. ఆమె నటించిన ‘కావాలయ్య’, ‘డా డా డాస్’ వంటి పాటలు షేక్ చేశాయి. ఇప్పుడు అదే జోరుతో చిరంజీవి సినిమాలో కూడా మాస్ ఆడియన్స్‌కు అదిరిపోయే కిక్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. చిరంజీవి లేటెస్ట్ మూవీ ‘మన శంకర వరప్రసాద్ గారు’లో స్పెషల్ సాంగ్ ఉండనుందని, అందులో మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా మెగాస్టార్‌తో కలిసి స్టెప్పులేయనున్నారని సమాచారం.

# ఓటీటీకి 100 కోట్ల సినిమా .. ‘డ్యూడ్’



ప్రేమకథలకు యూత్ ఆడియన్స్ సపోర్ట్ ఎప్పుడూ ఉంటుంది. ప్రేమకథలో ఫీల్ ఉండాలే గానీ, వాళ్లు ఆ కంటెంట్ కి కటౌట్ పెట్టేస్తారు. వందల కోట్ల వసూళ్లను ముట్టజెప్పేస్తారు. అలాంటి సినిమాల జాబితాలోనే ‘డ్యూడ్’ కూడా చేరిపోయింది. ప్రదీప్ రంగనాథన్ .. మమిత బైజు జంటగా నటించిన ఈ సినిమా, అక్టోబర్ 17వ తేదీన థియేటర్లకు వచ్చింది. 35 కోట్లతో నిర్మించిన ఈ సినిమా, చాలా తేలికగా 100 కోట్లను వసూలు చేసి పెట్టింది. కీర్తీశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాను, కొత్త కోణంలో ఆవిష్కరించారు. కథలోని కొత్త పాయింట్ యూత్ కి ఎక్కేసింది. అలాంటి ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి రావడానికి సిద్ధమవుతోంది. ఈ సినిమా స్ట్రీమింగ్ హక్కులను ‘నెట్ ఫ్లిక్స్’వారు దక్కించుకున్నారు. ఈ సినిమాను ఈ నెల 14వ తేదీ నుంచి స్ట్రీమింగ్ చేయనున్నారు. అందుకు సంబంధించిన అధికారిక ప్రకటన చేస్తూ పోస్టర్ ను కూడా వదిలారు.హీరో తన మేనమామ కూతురును ప్రేమిస్తాడు. ఆమెను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. ఆమె మనసులో మరొకరు ఉన్నారని తెలుసుకుంటాడు. వేరే కులానికి చెందిన వ్యక్తితో పెళ్లికి తన మేనమామ ఒప్పుకోడనే విషయం అతనికి తెలుసు. అప్పుడు అతను ఏం చేస్తాడు? ఫలితంగా ఎదురయ్యే పరిణామాలు ఎలా ఉంటాయి? అనేది కథ. ఐదు భాషల్లో ఓటీటీకి వస్తున్న ఈ సినిమాకి, ఈ వైపు నుంచి ఎలాంటి రెస్పాన్స్ వస్తుందనేది చూడాలి